నేటి కందం-నేటికి అందం

వేడగ మన బంధమ్మును
నే డిండోనేషియాకు నిశ్చలమతియై
మోడీ ప్రయాణ మయ్యెను
పాడగ స్నేహంపు గీతి పదుగురు మెచ్చన్ !!

(ఇండోనేషియా వేడిన విమ్మట రెండు దేశాల సంబంధాలు బలోపేతం చేయడానికి భారత ప్రధాని మోడీ ఆదేశానికి ప్రయాణం అయ్యారు. క్షేమంగా చేరారు. వారి స్వాగత సత్కారాలను అందుకున్నారు. అక్కడి ప్రవాస భారతీయులతో కరచాలనం చేసి సరదాగా గడిపారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

చురక

కల్ల ఇదని అనుకోకు
కదులుతుంది కత్తి
చూడు ఇటే వస్తుంది
చిత్రంగా గళమెత్తి.
నిన్న వాడి తల తీసినా
నాకేమని చూస్తుంటిమి
సరో గిరో ఐతేనేమి
స్పందించక ఊకుంటిమి

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ బుధవారం 8-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:259 పేజీలు:6 వెల: రూ.1/-


## వయనాడ్‌లో బీభత్సం.. కొండచరియలు విరిగిపడి ముగ్గురు మృతి.. శిథిలాల కింద చిక్కుకున్న పలువురు





కేరళ, జులై 7: కేరళలోని వయనాడ్ జిల్లాలో దారుణ ప్రమాదం జరిగింది. టన్నెల్ వద్ద కొండ చరియలు విరిగిపడిన ఘటనలో ముగ్గురు మరణించారు. మట్టిదిబ్బల కింద మరికొందరు చిక్కుకున్నారు. ఈ ఘటన కేరళలోని వయనాడ్ జిల్లా, మెప్పాడి సమీపంలోని కల్లాడి వద్ద మంగళవారం జరిగింది. స్థానిక మీనాక్షి బ్రిడ్జి వద్ద ఒక టన్నెల్ కోసం తవ్వాలు, నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఆ మట్టిదిబ్బలు, రాళ్ల కింద పలువురు చిక్కుకుపోయారు. వీరిలో ముగ్గురు మరణించారు. ఘటనపై సమాచారం అందుకున్న ఫైర్, రెస్క్యూ బృందాలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు ప్రారంభించాయి.

శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ ఘటనపై కేరళ సీఎం వీడీ సతీషన్ కూడా స్పందించారు. వయనాడ్ జిల్లా అధికారులతో మాట్లాడారు. తక్షణమే సహాయక చర్యలు ప్రారంభించి బాధితుల్ని కాపాడాలని, వ్యవస్థల్ని సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. సహాయక చర్యల్ని పర్యవేక్షించాల్సిందిగా మంత్రులు ఏపీ అనిల్ కుమార్, టీ సిద్దిఖ్‌లను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా ఇక్కడ టన్నెల్ నిర్మాణ పనుల్ని సోమవారం నుంచే నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో గడిచిన 24 గంటల్లో 265 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల కారణంగానే ఈ కొండచరియలు విరిగిపడి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. ఘటనా స్థలం వద్ద ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. రెస్క్యూ ఆపరేషన్స్ రాకముందే స్థానికులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

ఆరుగురిని రక్షించారు. ఈ ఘటనలో ముగ్గురు మరణించగా, మిగిలిన వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు ఈ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటం వల్ల పలు వాహనాలు కూడా దెబ్బతిన్నాయి. భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటం వల్ల స్థానికంగా నివసించే వారి భద్రత విషయంలో అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇండ్లకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు. పోలీసులతోపాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొ?ంటున్నాయి.

## సిరియాలో భారీ పేలుడు.. ఫ్రాన్స్ అధ్యక్షుడికి తప్పిన ముప్పు

న్యూఢిల్లీ, జులై 7:సిరియా రాజధాని డమాస్కస్ నగరంలో భారీ పేలుడు సంభవించింది. సిరియాలో తలెత్తిన చరిత్రాత్మక రాజకీయ మార్పుల తర్వాత, అక్కడి పర్యటనకు వచ్చిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ బస చేసిన హోటల్ సమీపంలోనే ఈ ఘటన జరగడం తీవ్ర కలకలం రేపింది.

డెమాస్కస్, జులై 7: సిరియా రాజధాని డమాస్కస్ నగరంలో ఇవాళ (మంగళవారం) భారీ పేలుడు సంభవించింది. సిరియాలో తలెత్తిన చరిత్రాత్మక రాజకీయ మార్పుల తర్వాత, మాజీ అధ్యక్షుడు బషర్ అల్-అసద్ పతనం అనంతరం అక్కడి పర్యటనకు వచ్చిన మొట్టమొదటి ప్రముఖ యూరోపియన్ యూనియన్ దేశాధినేతగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ రికార్డు సృష్టించారు. అయితే, ఆయన పర్యటన సాగుతున్న తరుణంలోనే ఈ పేలుడు సంభవించడం తీవ్ర కలకలం రేపింది.

## స్మగ్లర్లపై కఠిన చర్యలు.. డీజీపీ సీవీ ఆనంద్



ఖమ్మం జిల్లా, జులై 7 పోలీస్ వ్యవస్థలో అవినీతిని నిరోధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. ప్రలోభాలకు లొంగవద్దని సిబ్బందిని కోరుతున్నామని అన్నారు. ఈరోజు (మంగళవారం) ఖమ్మం జిల్లాలో డీజీపీ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఖమ్మం కమిషనరేట్‌లో సిబ్బంది పనితీరుపై సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాల పర్యటనలో భాగంగా ఖమ్మం కమిషనరేట్‌కి వచ్చానని తెలిపారు. ఖమ్మం తెలంగాణ రాష్ట్రానికి ముఖద్వారంగా ఉందని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణపై సమీక్షించానని పేర్కొన్నారు.గత మూడేళ్లుగా జరుగుతున్న నేరాలపై సమీక్షించామని డీజీపీ తెలిపారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నామని చెప్పారు. 6500 మంది అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించామని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించామని అన్నారు. ప్రతి రోజూ 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సిబ్బంది పనిభారంపై చర్చించామని చెప్పుకొచ్చారు. ఏఐపై సిబ్బందికి ప్రత్యేకమైన శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మాదకద్రవ్యాలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు.

### ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌ను తీసుకువస్తున్నాం..

స్మగ్లర్లపై చాలా కఠినంగా చర్యలు తీసుకుంటామని డీజీపీ హెచ్చరించారు. ఛత్తీస్‌ఘడ్, ఏపీ, ఒడిశా రాష్ట్రాల నుంచి ఫెడ్లర్లు వస్తున్నారని అన్నారు. సరిహద్దుల్లో గట్టి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సైబర్ క్రైంపై గట్టి నిఘా ఉంచామని వెల్లడించారు. సోషల్ మీడియాలో అసాంఘిక కార్యకలాపాలను ప్రచారం చేస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ బ్యూరో ప్రత్యేకంగా ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు. ట్రాఫిక్ సిస్టమ్‌ను మెరుగుపరిచేందుకు ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌ను తీసుకువస్తున్నామని వెల్లడించారు. హైవేలపై అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని.. దీనివల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో దారుణం.. భర్తను చంపి పూడ్చిపెట్టిన భార్య

హైదరాబాద్, జులై 7: నగరంలోని మియాపూర్‌లో దారుణం జరిగింది. కట్టుకున్న భర్తను ప్రియుడితో కలిసి భార్య అత్యంత కిరాతంగా హత్య చేసింది. ఆ తరువాత భర్త కనిపించడం లేదంటూ గతేడాది నవంబర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన మియాపూర్ పోలీసులు.. దర్యాప్తు చేపట్టగా అసలు నిజాలు బయటకు వచ్చాయి. ఏడు నెలల తర్వాత ఈ కేసులో భార్యే హంతకురాలిగా పోలీసులు తేల్చారు. భర్తను భార్యే హత్య చేసి ఆపై కనపించడం లేదంటూ నాటకం ఆడినట్లు పోలీసులు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా భార్య కాల్ రికార్డ్స్‌ను, సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఈ క్రమంలో ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు.

## కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..



హైదరాబాద్, జులై 7:కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. పరిపాలనా వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేస్తూ ముందుకు వెళ్లాలని, డిజిటల్ గవర్నెన్స్ దిశగా ప్రణాళికలు సిద్ధం చేసి అవసరమైన చట్టాలను రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ప్రతి నెల ఒకటో తారీఖున జీతాలు అందించేందుకు వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఇందులో భాగంగా వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు, వారి జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్‌పై పూర్తిస్థాయి కసరత్తు చేసేందుకు ఒక కమిటీని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కమిటీ 100 రోజుల్లోగా నివేదిక సమర్పించి, ఈ వ్యవహారాన్ని ఒక కొలిక్కి తీసుకురావాలని సీఎం గడువు విధించారు.

ఇదే సమయంలో ప్రభుత్వం తరఫున చెల్లింపులు జరిగినప్పటికీ, సమయానికి ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా వేధించే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను గట్టిగా ఆదేశించారు.

## డిజిటల్ గవర్నెన్స్ వైపు రేవంత్ రెడ్డి సర్కార్ అడుగులు..

హైదరాబాద్, జులై 7: తెలంగాణ రాష్ట్ర పరిపాలనలో పారదర్శకతను పెంచడంతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త డిజిటల్ వ్యూహాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేసి, అవసరమైన మేరకు నూతన చట్టాలను రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.

ఒకటో తారీఖునే జీతాలు..

ప్రభుత్వ ఉద్యోగులతో పాటే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా ప్రతి నెలా 1వ తేదీ నుంచి 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు అందేలా వ్యవస్థను మార్చాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పూర్తి వివరాలు, వారి వేతనాలు, బ్యాంక్ అకౌంట్ డేటాను 100 శాతం డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు.

రాష్ట్రంలో దాదాపు 4,800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా.. అందులో దాదాపు 4,300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ , పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు విడుదలవుతున్నప్పటికీ, ఏజెన్సీలు ఉద్యోగులకు సమయానికి జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్నట్లు తేలింది. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన సీఎం రేవంత్ రెడ్డి.. అక్రమాలకు పాల్పడుతున్న మరియు నిర్లక్ష్యం వహిస్తున్న సదరు ఏజెన్సీలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్ ద్వారా ఇలాంటి దోపిడీ వ్యవస్థకు శాశ్వతంగా చెక్ పెట్టాలని సూచించారు.

100 రోజుల్లో నివేదిక ఇవ్వాలని హైలెవెల్ కమిటీకి ఆదేశం

ఈ సరికొత్త డిజిటల్ విధానంపై పూర్తిస్థాయిలో కసరత్తు చేసేందుకు వీలుగా ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ కమిటీ రాబోయే 100 రోజుల్లో సమగ్ర నివేదికను సమర్పించి, ఈ సంస్కరణలను ఒక కొలిక్కి తీసుకురావాలని డెడ్‌లైన్ విధించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డులు, ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ వేగంగా అమలు చేసేందుకు వారి వివరాలను కూడా డిజిటలైజ్ చేయాలని సీఎం చెప్పారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకు ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఎంసీఆర్ హెచ్ఆర్డీ వైస్ చైర్మన్ శాంతికుమారితో పాటు పలువురు ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## సింగరేణికి కేంద్రం పూర్తి సహాయ సహకారాలు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, జులై 7: దేశాభివృద్ధి విషయంలో సహకార సమాఖ్య విధానంతో అన్ని రాష్ట్రాలు కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు (మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సింగరేణి కోల్ కాలరీస్ లిమిటెడ్ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. 39 వర్కింగ్ మైన్స్‌లో 21 అండర్ గ్రౌండ్ మైన్స్, 18 ఓపెన్ కాస్ట్ మైన్స్ ఉన్నాయని.. సుమార్ 6 నుంచి 8 జిల్లాల్లో సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయని అన్నారు. లక్షలాది ప్రజల గుండెచప్పుడు సింగరేణి అని వెల్లడించారు.

సింగరేణికి సంబంధించిన మేజర్ మైనింగ్ ప్రాజెక్టుల ఎన్విరాన్‌మెంటల్, ఫారెస్ట్ క్లియరెన్స్‌లను వేగవంతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోనూ సింగరేణి కార్మికులు భాగస్వాములయ్యారని తెలిపారు. కార్మికుల ధైర్యాన్ని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరన్నారు. ఒడిశాలో నైనీ కోల్ బ్లాక్ సింగరేణికి వచ్చేలా కృషి చేసినట్లు తెలిపారు. సింగరేణి పురోగతికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణతో పాటుగా ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు గనుల వేలంలో పాల్గొనేలా సింగరేణి ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లో సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్నాయన్నారు. 30 నుంచి 35 సంవత్సరాలకు సరిపోయే బొగ్గు ఉందని తెలిపారు. ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం సింగరేణికి లభించిందని.. దీని వల్ల సింగరేణికి సుమారు రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉందన్నారు.

సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు కేటాయించామని కిషన్ రెడ్డి తెలిపారు. తాడిచర్ల-2 బొగ్గు గనులపై తుది నిర్ణయం తీసుకున్నామన్నారు. దాదాపు 182 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్న ఈ బ్లాక్ ద్వారా.. ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుందన్నారు. దాదాపు 40 నుంచి 50 ఏళ్ల పాటు ఈ గని నుంచి బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని చెప్పుకొచ్చారు. దీని ద్వారా మొత్తంగా రూ.64,000 కోట్లకు పైగా రెవెన్యూ వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

## 'సముద్రం మనల్ని విడదీయలేదు'..

-ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపు
-ఇండోనేషియా పార్లమెంట్‌లో మోదీ చారిత్రాత్మక ప్రసంగం..
భారత్-ఇండోనేషియా మధ్య భారీ ఒప్పందాలు
-ఇండోనేషియాలో మోదీకి అత్యున్నత పౌర పురస్కారం..
-రక్షణ, విద్య, సాంకేతిక రంగాల్లో భారత్-ఇండోనేషియా చారిత్రాత్మక భాగస్వామ్యం
-బ్రహ్మోస్, ఐఐఎంబీ సహా 20 కీలక ఒప్పందాలు!



న్యూఢిల్లీ, జులై 7:ఇండోనేషియా పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ రెండో రోజు చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టారు. మంగళవారం ఇండోనేషియా పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. భారత్, ఇండోనేషియాలు కేవలం పొరుగు దేశాలు మాత్రమే కావని, ఉమ్మడి చరిత్ర, సంస్కృతి, ప్రజాస్వామ్య విలువలతో ముడిపడిన 'నాగరికత భాగస్వాములు' అని అభివర్ణించారు. 140 కోట్ల మంది భారతీయులు, 29 కోట్ల మంది ఇండోనేషియా ప్రజలు కలిసి నడిస్తే ప్రపంచం ఒక సరికొత్త చరిత్రను వీక్షిస్తుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు.

సముద్రం మనల్ని వేరు చేయలేదు..

పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ ఇరు దేశాల మధ్య శతాబ్దాల నాటి సాంస్కృతిక బంధాన్ని గుర్తుచేశారు. "మన సంబంధాలు రామాయణ, మహాభారతాల వారసత్వంలో, నలందా విశ్వవిద్యాలయ జ్ఞానంలో దాగి ఉన్నాయి. బోరోబుదూర్, ప్రంబనన్ వంటి అద్భుతమైన కట్టడాలు మనల్ని ఎప్పటికీ కలుపుతూనే ఉంటాయి. భౌగోళికంగా మన రాజధానులు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ.. సముద్ర తీరం పరంగా కేవలం 150 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాం. చాలా దేశాలకు సముద్రం ఒక సరిహద్దు కావచ్చు, కానీ భారత్-ఇండోనేషియాల మధ్య సముద్రం ఎప్పుడూ దూరాన్ని సూచించలేదు. అది మనల్ని కలిపే ఒక వంతెన" అని మోదీ వ్యాఖ్యానించారు. భారత్ ఎప్పుడూ విస్తరణవాదాన్ని నమ్మదని, కేవలం అభివృద్ధి పంథాలోనే పయనిస్తుందని.. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్' (అందరి మద్దతుతో అందరి అభివృద్ధి) అనే మంత్రంతోనే తాను ఇక్కడికి వచ్చానని స్పష్టం చేశారు.

ఇండోనేషియా అత్యున్నత పౌర పురస్కారం 'బింతాంగ్ ఆదిపూర్ణ'

ఈ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీకి ఇండోనేషియా ప్రభుత్వం తమ దేశపు అత్యున్నత పౌర పురస్కారం 'బింతాంగ్ ఆదిపూర్ణ' ను అందించి గౌరవించింది. ఈ పురస్కారాన్ని అత్యంత వినమ్రతతో స్వీకరిస్తున్నట్లు తెలిపిన మోదీ.. "ఈ గౌరవం కోట్లాది మంది భారతీయులకు, ఇరు దేశాల ప్రజాస్వామ్య విలువలకు మరియు ఉమ్మడి వారసత్వానికి దక్కిన గౌరవం" అని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా అధ్యక్షుడు ప్రబోవోకు కృతజ్ఞతలు తెలిపారు. ఉదయం తనకు లభించిన ఘన స్వాగతాన్ని ప్రస్తావిస్తూ.. "ఈ ప్రేమ, గౌరవాలపై ఎవరికీ కాపీరైట్ లేదు" అని చమత్కరించారు.

రక్షణ, విద్య, సాంకేతికత రంగాల్లో 20 చారిత్రాత్మక ఒప్పందాలు

ప్రధాని మోదీ, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోల మధ్య జరిగిన ప్రతినిధుల స్థాయి చర్చల అనంతరం ఇరు దేశాలు వివిధ రంగాలలో ఏకంగా 20 చారిత్రాత్మక ఒప్పందాలపై సంతకాలు చేసుకున్నాయి. వ్యూహాత్మక 'బ్రహ్మోస్' మిసైల్ సిస్టమ్, ఎయిర్-టు-ఎయిర్ మిసైల్ టెక్నాలజీపై కీలక రక్షణ ఒప్పందాలు జరిగాయి. ఇండోనేషియాలోని 'సింఘసారీ ఎన్ఈజెడ్' లో ప్రముఖ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ బెంగళూరు అంతర్జాతీయ బ్రాంచ్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నారు. మైనింగ్, క్రిటికల్ మినరల్స్, అగ్రికల్చర్, టెలికమ్యూనికేషన్స్, హెల్త్‌కేర్, స్పేస్ కోఆపరేషన్, డిజాస్టర్ మేనేజ్మెంట్ , డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లలో పరస్పర సహకారం.

ఈ పర్యటన ఫలితాలు ఎంతో విస్తృతమైనవి, స్పష్టమైనవి మరియు భవిష్యత్తుకు దిక్సూచి లాంటివని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇరు దేశాల మైత్రి రాబోయే కాలంలో మరిన్ని సరికొత్త శిఖరాలను అధిరోహిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇండోనేషియా పర్యటన ముగించుకుని ప్రధాని మోదీ తన తదుపరి పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియాకు బయలుదేరనున్నారు.


ఆహ్వానం

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ
జివిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్
సంయుక్త ఆధ్వర్యంలో..

కవి సుధీర్ కుమార్ తేళ్లపురి గారి
ప్రణమిల్లే పాదాలు
కవితా సంపుటి ఆవిష్కరణ సభ

12
జూలై, 2026
ఆదివారం
సాయంత్రం 6 గంటలకు
రవీంద్రభారతి
సమావేశ మందిరం,
హైదరాబాద్





సభాధ్యక్షులు : డా. టి. గౌరీశంకర్ గారు
సాహితీ పరిశోధకులు, పూర్వ రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయం

ముఖ్యఅతిథి గ్రంథావిష్కర్త : డా. ఏనుగు నరసింహారెడ్డి గారు
సుప్రసిద్ధ కవి, సంచాలకులు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ

విశిష్ట అతిథి: శ్రీ బైస దేవదాస్ గారు
ఎడిటర్, నేటినిజం దినపత్రిక

ప్రత్యేక అతిథి : శ్రీమతి శైలజామిత్ర గారు
ప్రసిద్ధ కవయిత్రి, సాహితీ విమర్శకురాలు

ఆత్మీయ అతిథి : శ్రీ పెద్దూరి వెంకటదాసు గారు
ప్రముఖ రచయిత, విశ్రాంత పోలీసు అధికారి

గౌరవ అతిథి : శ్రీ రచ్చరవి గారు
ప్రముఖ సినీ నటుడు, రచయిత

పుస్తక సమీక్ష : శ్రీ సరికొండ నరసింహరాజు గారు
ప్రముఖకవి, వ్యవస్థాపకులు సృజనకళల వేదిక

కృతి స్వీకర్త : శ్రీ మౌనశ్రీమల్లిక్ గారు
ప్రముఖ కవి, సినీ, టీవీ గీతరచయిత

ఆహ్వానించువారు: లయన్ వివి రాఘవరెడ్డి
పోతుగ్రరి సుబ్బారావు
జివిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్

# ప్రపంచ యువత చూపూ వీడియో గేమ్స్ వైపు

## (జూలై 08న "ప్రపంచ వీడియో గేమ్ దినోత్సవం" సందర్భంగా)

వీడియో గేమ్ అని పిలువబడే అద్భుతమైన డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను అన్ని రూపాల్లో ఆస్వాదించడానికి, అభినందించడానికి, ప్రచారం చేయడానికి ప్రతి సంవత్సరం జూలై 8న జాతీయ వీడియో గేమ్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1980ల నాటి ఆర్కేడ్ క్లాసిక్స్ నుండి నేటి విస్తారమైన ఓపెన్ వరల్డ్ వరకు ఈ మాధ్యమం చుట్టూ ఉన్న కళాత్మకత, నైపుణ్యం మరియు కమ్యూనిటీని గుర్తించడానికి ఈ రోజును కేటాయిస్తారు. ఇది ఆడుకోవడానికే నిర్మించబడిన రోజు, కాబట్టి దీనిని జరుపుకోవడానికి ఉత్తమ మార్గం కంట్రోలర్‌ను చేతిలోకి తీసుకోవడమే.

### జాతీయ వీడియో గేమ్ దినోత్సవం-2026:

జాతీయ వీడియో గేమ్ దినోత్సవం వేదికగా చిన్ననాటి ఇష్టమైన వీడియోను మళ్లీ చూడటం, గేమ్ నైట్ నిర్వహించడం, సరికొత్త టైటిల్‌ను ప్రయత్నించడం, రెట్రో ఆర్కేడ్‌ను సందర్శించడం, ఇండి గేమ్స్‌ను అన్వేషించడం, స్ట్రీమ్‌ను చూడటం, మీరు ఎప్పుడూ పూర్తి చేయని గేమ్‌ను పూర్తి చేయడం, గేమింగ్‌కు కొత్త వారిని పరిచయం చేయడం వంటి అనేక విధాలుగా జరుపుకోవచ్చు. వినోదం, సంస్కృతి మరియు క్రీడలలో కూడా వీడియో గేమ్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. ఇది డెవలపర్‌లను, వాటిని రూపొందించే కళాకారులను, తమ నైపుణ్యాన్ని తీవ్రమైన అభిరుచిగా మార్చుకున్న ఆటగాళ్లను గౌరవిస్తుంది. దీనిని సాధారణ మొబైల్ ప్లేయర్‌లు, అంకితభావం గల ఔత్సాహికులు ఇద్దరూ ఆస్వాదిస్తారు, ఇది ఏ ఒక్క ప్లాట్‌ఫారమ్ లేదా జానర్‌కు పరిమితం కాదు.

### వీడియో గేమ్‌ల చరిత్ర:

వీడియో గేమ్ చరిత్ర 1940లో డాక్టర్ ఎడ్వర్డ్ ఉహ్లర్ మొదటి వీడియో గేమింగ్ యంత్రాన్ని ఆవిష్కరించడంతో ప్రారంభమైంది. తరువాత, ఫ్రాంక్ సిఫాల్డి, ఇది మొదటిసారిగా 08 జూలై 1991న చేజ్ క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్‌లో కనిపించిందని కనుగొన్నారు. 1997 నాటికి సెప్టెంబర్ 13న "జాతీయ వీడియో గేమ్స్ దినోత్సవాన్ని", అలాగే జూలై 8న కూడా "జాతీయ వీడియో గేమ్ దినోత్సవం"గా పాటించడానికి పేరు మార్చారు. కేవలం వినోదానికి మించి, కథలు చెప్పడం, సంగీతం, కళ, పోటీ క్రీడలను తీర్చిదిద్దుతూ, ఆటలు ఎలా ఒక నిజమైన సాంస్కృతిక శక్తిగా మారాయో ఈ రోజు హైలైట్ చేస్తుంది. ఈ రోజున ప్రపంచవ్యాప్తంగా గేమింగ్ మారథాన్‌లను నిర్వహించడం, చిన్ననాటి క్లాసిక్‌లను తిరిగి చూడటం, గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో ప్రత్యేక ప్రమోషన్‌ల ద్వారా వీడియో గేమ్‌లను జరుపుకుంటారు. గేమింగ్ ఒక భారీ డిజిటల్ కమ్యూనిటీగా అభివృద్ధి చెందినందున, అభిమానులు ఏడాది పొడవునా విడుదలయ్యే కొత్త టైటిల్స్‌ను కలిసి కనుగొని వీక్షించవచ్చు.

ఒక్కరే ఒంటరిగా ఒక సింగిల్ ప్లేయర్ గేమ్ యొక్క గొప్ప ప్రపంచాన్ని అన్వేషిస్తూ సమయం గడపడం అయినా, లేదా స్నేహితులతో కలిసి సరదాగా కబుర్లు చెప్పుకోవడం అయినా, ఈ రోజును జరుపుకోవడానికి తప్పు పద్ధతి అంటూ ఏదీ లేదు. మీ కళ్ళు మరియు నడుము ఆరోగ్యం కోసం విరామం తీసుకోవడం మాత్రం మర్చిపోకండి.



-మధుపాళీ
9949700037

# డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి ఆయనకు పుష్పాంజలి ఘటించిన ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్



న్యూ ఢిల్లీ, జులై 7:డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి ఈ రోజు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్ ఆయనకు ఉపరాష్ట్రపతి భవన్లో పుష్పాంజలి ఘటించారు.

డాక్టర్ ముఖర్జీకి శ్రీ సి.పి. రాధాకృష్ణన్ నివాళులు అర్పిస్తూ, దేశ ఏకత కోసం ఆయన తన జీవితాన్ని త్యాగం చేశారని, అలాంటి ఘన త్యాగాలు "ఎన్నటికీ మరవురానివి" అని కొనియాడారు.

దేశంలో ఒకే రాజ్యాంగ ప్రాథమిక ప్రణాళిక పరిధిలో ప్రతి ఒక్కరికీ సమాన ప్రతిపత్తి లభించాలని డాక్టర్ ముఖర్జీ తలచారని ఉపరాష్ట్రపతి అన్నారు. దేశ సమైక్యత కోసం డాక్టర్ ముఖర్జీ జీవిత పర్యంతం కట్టుబడ్డారని, ప్రాణత్యాగానికైనా వెనుదీయని ఆయన ఆదర్శాలకు రాజ్యాంగ 370వ అధికరణాన్ని రద్దు చేయడం సముచిత నివాళి అని ఉపరాష్ట్రపతి అన్నారు.భారత విద్యా, రాజకీయ, ప్రజాస్వామిక రంగాల్లో చెరగని ముద్రను వేసిన డాక్టర్ ముఖర్జీ "ఒక ప్రముఖ విద్యావేత్త, దూరదృష్టి కలిగిన రాజనీతిజ్ఞ?డు, దేశ నిర్మాత" అని ఉపరాష్ట్రపతి సామాజిక మాధ్యమాల్లో పొందుపరిచిన ఒక సందేశంలో ప్రస్తావించారు.

ఆయన అసాధారణ ప్రజాజీవితాన్ని ఉపరాష్ట్రపతి గుర్తుచేస్తూ, అతి పిన్న వయస్సులోనే కలకత్తా విశ్వవిద్యాలయ ఉప కులపతులైన వారిలో డాక్టర్ ముఖర్జీ ఒకరని, రాజ్యాంగ పరిషత్తు సభ్యులలో ఆయనకు స్థానాన్ని కల్పించారని, అఖిల భారతీయ హిందూ మహాసభకు అధ్యక్షునిగా, స్వతంత్ర భారతదేశ మొదటి పరిశ్రమ, సరఫరాల శాఖ మంత్రిగా, భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకునిగా డాక్టర్ ముఖర్జీ దేశ ప్రజలకు అసాధారణ సేవలను అందించారన్నారు.

జాతీయ సమైక్యతను, సమగ్రతను డాక్టర్ ముఖర్జీ గట్టిగా సమర్థించారని, జమ్మూ కాశ్మీరును భారత్‌లో పూర్తి స్థాయిలో విలీనం చేయడానికి పాటుపడి ఆ క్రమంలో ప్రాణత్యాగం చేశారని ఉపరాష్ట్రపతి అన్నారు. డాక్టర్ ముఖర్జీ జీవితం, ఆదర్శాలు సశక్త, సమైక్య, స్వయంసమృద్ధ, వికసిత్ భారత్‌ను నిర్మించాలనే ఉమ్మడి ప్రయత్నాల్లో భిన్న తరాల వారికి స్ఫూర్తిని అందిస్తుంటాయని ఉపరాష్ట్రపతి అన్నారు.

# ప్రతి కుటుంబం ఒక మొక్క నాటి సంరక్షించాలి: ఏఎంసీ చైర్మన్ భూషణ్



ఆదిలాబాద్, జులై 7:కడెం మండలం పెద్ద బెల్లాల్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎన్ఆర్ఈజీఎస్ గ్రామపంచాయతీ నర్సరీలో పెంచిన మొక్కలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ పి. భూషణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా భూషణ్ మాట్లాడుతూ, మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛమైన గాలి, వర్షపాతం పెరుగుదల, భూగర్భ జలాల సంరక్షణకు మొక్కలు ఎంతో దోహదపడతాయని తెలిపారు.

ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించి భావితరాలకు పచ్చని ప్రకృతిని అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామస్తులకు మొక్కలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఏడీఏ సుజాత, కడెం ఎంపీడీఓ శ్రీనివాస్, పెద్ద బెల్లాల్ గ్రామ సర్పంచ్ ఈదుల తిరుపతి, ఆర్టీఏ సభ్యుడు తుమ్మల మల్లేష్, మాజీ జెడ్పీటీసీ తక్కల రాధ సత్యనారాయణ, ఉప సర్పంచ్ తక్కల రమ్య రవీందర్, ఏఈఓ ఎండపల్లి అశోక్ కుమార్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఈజీఎస్ ఈఎఫ్ఏటీ రాజలింగం, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇండొనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల పర్యటనకు ముందు ప్రధానమంత్రి ప్రకటన

న్యూ ఢిల్లీ, జులై 7:ఇండొనేషియా అధ్యక్షుడు శ్రీ ప్రబొవొ సుబియాంతొ ఆహ్వానించడంతో, నేను ఈ నెల 6 నుంచి 8 వరకూ ఇండొనేషియాలో పర్యటిస్తాను. 2018లో నేను మొదటిసారి ఇండొనేషియా పర్యటనకు వెళ్లినప్పుడు భారత్, ఇండొనేషియా తమ ద్వైపాక్షిక సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంపొందింపచేసుకున్నాయి. ద్వైపాక్షిక సంబంధాల స్థాయి పెరిగిన తరువాత ఇదే నేను చేపట్టబోయే మొదటి ద్వైపాక్షిక పర్యటన. అధ్యక్షుడు శ్రీ ప్రబొవొ అధికార పర్యటన అనంతరం నా ఈ పర్యటన చోటుచేసుకోనుంది. అప్పట్లో అంటే.. 2025 జనవరి 26న ఆయన మన గణతంత్ర దినోత్సానికి ముఖ్య అతిథిగా వచ్చారు. భారత్, ఇండొనేషియా మధ్య బలమైన నాగరికత సంబంధమైన ప్రజా సంబంధాలు నెలకొన్నాయి. నా ఈ పర్యటన మన బహుముఖీన భాగస్వామ్యానికి చెందిన అన్ని అంశాలనూ మరింత దృఢతరంగా మారుస్తుంది. నా పర్యటన కాలంలో, నేను ఇండొనేషియాలో నివసిస్తున్న ప్రవాసీ భారతీయులతోనూ సమావేశమవుతాను. అధ్యక్షుడు శ్రీ ప్రబొవొతో కలిసి యోగ్యకర్తలోని ప్రంబానన్ దేవాలయ పరిసరాలను సందర్శిస్తాను. ఆ దేవాలయం మన సన్నిహిత సాంస్కృతిక సంబంధాలకు మరొక అద్భుత నిదర్శనంగా నిలుస్తుంది.

ఇండొనేషియా నుంచి, నేను ఆస్ట్రేలియా ప్రధాని శ్రీ ఆంథోనీ అల్బనీజ్ ఆహ్వానంపై మెల్‌బోర్న్‌కు పయనమవుతాను. నా ఈ పర్యటన మన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలపరుస్తుంది. ప్రధాని శ్రీ అల్బనీజ్‌తో పాటు నేను నిర్వహించే చర్చల్లో రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, అనుసంధానం, రెండు దేశాల ప్రజల మధ్య పరస్పర సంబంధాలు.. ఈ రంగాల్లో మన సంబంధాలు బలపడతాయి. మెల్‌బోర్న్‌లో ప్రవాసీ భారతీయులతో భేటీ అయ్యే అవకాశం నాకు కలగనుంది. ప్రవాసీ భారతీయులు మన వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఒక ముఖ్యాధారంగా నిలుస్తున్నారు. దీనికి అదనంగా, ఈ పర్యటన భారత్, ఆస్ట్రేలియా మధ్య సరికొత్తగా ఉనికిలోకి వస్తున్న కీలక సాంకేతికతలు, క్రీడలు, స్పోర్ట్స్ సైన్స్ రంగాల్లో మన ద్వైపాక్షిక సంబంధాలను మరింతగా దృఢతరంగా మార్చుకొనే అవకాశాన్ని కూడా అందిస్తుంది.

న్యూజిలాండ్ ప్రధాని శ్రీ క్రిస్టఫర్ లక్సన్ ఆహ్వానించడంతో, నేను మెల్‌బోర్న్ నుంచి న్యూజిలాండ్ లోని ఆక్లాండ్‌లో పర్యటించనున్నాను. నా ఈ పర్యటన 2025 మార్చి నెలలో ప్రధాని శ్రీ లక్సన్ భారత్‌లో పర్యటించిన తరువాత మన ద్వైపాక్షిక సంబంధాల్లో చోటు చేసుకున్న దృఢత్వాన్ని మరింత పటిష్ఠపరచనుంది. ఈ పర్యటన కాలంలో, నేను ప్రధాని శ్రీ లక్సన్‌తో కలిసి ఆర్థిక, వాణిజ్య, సంబంధాలను బలోపేతం చేసుకొనే పద్ధతులపై చర్చిస్తాను. భారత్, న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకొని ద్వైపాక్షిక వాణిజ్యం, వాణిజ్య సంబంధాలను బలపరుచుకోవాలన్న ఆసక్తిని చాటాయి. మన ద్వైపాక్షిక సంబంధాల్లో ప్రవాసీ భారతీయులందించిన తోడ్పాటు ముఖ్యమైంది. ఈ పర్యటన కాలంలోనే, నేను ప్రవాసీ భారతీయులు పాల్గొనే పెద్ద సభను ఉద్దేశించి ప్రసంగించేందుకు ఆసక్తితో ఎదురు చూస్తున్నాను. వారు జీవితంలో అన్ని రంగాల్లోనూ శ్రేష్ఠమైన పనితీరును కనబరుస్తున్నారు.

తూర్పు, దక్షిణ హిందూ మహాసముద్రంలో నెలకొన్న ఇండొనేషియా, ఆస్ట్రేలియాలతో పాటు ఈ రెండు దేశాల తరువాత న్యూజిలాండ్‌లో నా పర్యటన భారత్ అనుసరిస్తున్న 'ఈస్ట్ ఇండియా పాలిసీ', మహాసాగర్ దార్శనికతతో పాటు స్వతంత్ర, బహిరంగ ఇండో -పసిఫిక్‌ను ఆవిష్కరించాలన్న మన దృష్టికోణాన్ని మరింత బలపరుస్తుంది.

# డిప్యూటీ సీఎంకు స్వాగతం పలికిన ఎంపీ కేశినేని చిన్ని

విజయవాడ, జులై 7:విజయవాడ అంబేద్కర్ కళా వేదికలో ఏపీ హస్తకళ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొని ప్రారంభించారు. డిప్యూటీ సీఎం పవన్ కు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని చిన్ని స్వాగతం పలికి పవన్ కళ్యాణ్ తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసినటువంటి స్టాల్స్ అన్నిటిని డిప్యూటీ సీఎం పవన్, మంత్రి సవిత, ఎంపీ కేశినేని చిన్ని, ఆంధ్రప్రదేశ్ హస్తకళ నైపుణ్య అభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా, పలువురు ఉన్నతాధికా రులు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపి కేశి నేని చిన్ని మాట్లాడుతూ ఆంధ్రప్ర దేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న లేపాక్షి హస్తకళ మహోత్సవం హస్తకళ ఎక్స్పో అత్యంత వైభవంగా ప్రారంభోత్సవం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదగా ప్రారంభించుకోవడం మంచి పరిణామం అని తెలిపారు లేపాక్షి అనేది ఒక సంస్థ మాత్రమే కాదు అది ఆంధ్రప్రదేశ్ హస్తకళల వారసత్వం సంస్కృతి సాంప్రదాయం కళాకారుల సృజనాత్మక ప్రతీకాని ఎంపీ చిన్ని తెలిపారు రాష్ట్రంలో వేలాదిమంది హస్తకళాకారుల జీవనోపాధికి బలమైన ఆధారంగా నిలుస్తున్న లేపాక్షిని ప్రపంచ స్థాయిలో మరింత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి లక్ష్యమని అన్నారు.

సంప్రదాయ హస్తకళలను పరిరక్షిస్తూనే ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వాటిని ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించేందుకు అన్ని రకాల చర్యలు ఈ కూటమి ప్రభుత్వం చేపడుతుందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళలు ప్రపంచ వ్యాపంగా ప్రత్యేక గుర్తింపు తీసుకురావడం లేపాక్షి బ్రాండ్ మరింత బలోపేతం చేయడం ఈ కామర్స్ వేదికల ద్వారా విక్రయాలు విస్తరించడం లక్ష్యంగా కార్యచరణ కొనసాగుతుందని తెలియజేశారు.

# విద్యార్థులకు ఉచిత కాపీరైటింగ్ పుస్తకాల పంపిణీ




ఆదిలాబాద్, జులై 7:దండేపల్లి మండలంలోని పాతమామిడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని దొరగారిపల్లి మండల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థుల విద్యాభివృద్ధి, చేతిరాత మెరుగుదల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలకు సంబంధించిన కాపీరైటింగ్ పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ చిన్న నర్సయ్య, సీఆర్పీ సురేందర్ విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రాథమిక దశలోనే అక్షర దోషాలు లేకుండా అందమైన చేతిరాత అలవర్చుకోవడం విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ప్రతిరోజూ సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఉపాధ్యాయురాలు ఆదేశ్వరి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సాంకేతిక మార్గంలో ద్విభాషా మేనేజ్‌మెంట్ విద్య దీంతో గ్రామీణ-పట్టణ వ్యత్యాసాల తొలగింపు సాధ్యం: కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, జులై 7:సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా అందిస్తున్న ద్విభాషా మేనేజ్‌మెంట్ విద్యతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న వ్యత్యాసాలను తొలగించవచ్చని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఈ విధానం వల్ల ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు వారి పరిస్థితులతో సంబంధం లేకుండా నాణ్యమైన ఉన్నత విద్య సులభంగా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఉదయ్‌పూర్‌లోనా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో (ఐఐఎం) కొత్తగా ప్రారంభించిన ఒక కోర్సు ప్రారంభోత్సవానికి ఆయన న్యూఢిల్లీ నుంచి వర్చువల్ పద్ధతిలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఆన్‌లైన్ ద్విభాషా బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ) కార్యక్రమం ఒక ప్రత్యేక ముందడుగుగా అభివర్ణించారు. మేనేజ్‌మెంట్ విద్యను సరళమైన, సులభంగా అర్థమయ్యే భాషలో అందించడం ద్వారా ఇది సమాజంలో విస్తృతమైన సానుకూల ప్రభావాన్ని చూపుతుందని తెలిపారు.

ఈ ద్విభాషా కోర్సు హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఉండటం వల్ల ఐఐఎం విద్యా ప్రమాణాలు, దాని విశ్వసనీయతను దేశంలోని మెజారిటీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి సహాయపడుతుందని శ్రీ గోయల్ అన్నారు. ఈ డిగ్రీ కోర్సు భారతీయ పరిశ్రమల అవసరాలను తీరుస్తూ, దేశ ప్రగతికి తోడ్పడే ఒక విజయవంతమైన కార్యక్రమంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

దేశంలో ప్రస్తుతం దాదాపు 100 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదారులు ఉన్నారని మంత్రి పీయూష్ గోయల్ ప్రస్తావించారు. కొత్త విద్యా విధానం లక్ష్యాలకు అనుగుణంగా భారీ సాంకేతిక సామర్థ్యాన్ని వాడుకుంటూ నాణ్యమైన విద్యను దేశంలోని నలుమూలలకూ విస్తరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రస్తుతం డిజిటల్ సాంకేతికత, ఆన్‌లైన్ విద్యా విధానం దేశంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్నాయని పేర్కొన్న మంత్రి.. ఈ ఆన్‌లైన్ అభ్యాస ప్రక్రియను దేశవ్యాప్తంగా మరింతగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

"ఇకపై ఐఐఎం తరగతి గదులు నేరుగా విద్యార్థుల స్క్రీన్లపైనే కనిపిస్తాయి" అని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని భిల్వారాలోని ఒక చిన్న దుకాణదారుడి నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవుల్లో నివసించే వారి వరకు ఈ విద్యా కార్యక్రమం అందరికీ చేరువవుతుందని ఆయన తెలిపారు. కంప్యూటర్ స్క్రీన్, లాప్‌టాప్ లేదా కేవలం ఒక స్మార్ట్‌ఫోన్ ద్వారా కూడా ఈ కోర్సును నేర్చుకోవచ్చని, అందుకే దీనికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఈ కోర్సు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా బోధించినప్పటికీ, పరీక్షలను మాత్రం ఆఫ్‌లైన్ (ప్రత్యక్షంగా) పద్ధతిలోనే నిర్వహిస్తారని, దీని వల్ల విద్యా ప్రమాణాల్లో ఎక్కడా పారదర్శకత, జవాబుదారీతనం లోపించదని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయడానికి మంత్రి నాలుగు ముఖ్యమైన సూచనలను ప్రతిపాదించారు. అందులో మొదటి సూచనగా.. సాధ్యమైనంతవరకు ఈ హైబ్రిడ్ నమూనాలో అధ్యాపకులు నెలకు ఒకసారి క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని, అలాగే విద్యార్థులంతా వేర్వేరు ప్రాంతాల్లో ఒకచోట కలుసుకునేలా అవకాశాలు కల్పించాలని సూచించారు. మేనేజ్‌మెంట్ విద్య అనేది కేవలం పాఠశాల, కళాశాల, తరగతి గది చదువులకే పరిమితం కాదని.. విద్యార్థుల మధ్య పరస్పర సంబంధాలు, చర్చల ద్వారానే అది సంపూర్ణమవుతుందని తెలిపారు. ఈ విధమైన ప్రత్యక్ష సమావేశాలను హైబ్రిడ్ నమా?నాలో చేర్చడం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

తన రెండో సూచనగా.. విద్యార్థుల్లో సాఫ్ట్ స్కిల్స్‌అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై లోతైన అవగాహనతో పాటు చక్కటి కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమష్టిగా పనిచేయడం, సాంస్కృతిక, మానవ సంబంధాల అవగాహన వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వడం ఎంతో ముఖ్యమన్నారు. ఈ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించడం వల్ల విద్యార్థులు భవిష్యత్తులో అద్భుతమైన విజయాలు సాధిస్తారని శ్రీ పీయూష్ గోయల్ పేర్కొన్నారు.

మంత్రి తన మూడో సూచనగా.. విద్యార్థులకు అనుభవపూర్వక అభ్యాసాన్ని అందించాలని కోరారు. ఇందులో భాగంగా విద్యార్థులను కర్మాగారాలు, ఓడరేవులు, పారిశ్రామిక ప్రాంతాల క్షేత్రస్థాయి పరిశీలనకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఇలాంటి అవకాశాలను కల్పించడం వల్ల విద్యార్థులకు వ్యాపార నిర్వహణపై ఆచరణాత్మక అవగాహన వస్తుందని తెలిపారు.

నాలుగో సూచనగా.. అంతర్జాతీయంగా విద్యా రంగంలో ఉన్న అత్యుత్తమ విధానాలను అవలంబించాలని సంస్థను కోరారు. ఇందులో భాగంగా ఆధునిక ఆడియో-విజువల్, డిజిటల్ సాధనాలను ఉపయోగించడంతో పాటు నూతన విద్యా విధానం ప్రకారం రుణ బదిలీల సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ప్రపంచస్థాయి అత్యుత్తమ విద్యాసంస్థలతో చేతులు కలిపి.. ప్రత్యక్ష, వర్చువల్ పద్ధతుల్లో ఉమ్మడి విద్యా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు తమ నాల్గో సంవత్సరంలో పరిశోధనలు చేసేలా ప్రోత్సహించి, వారికి పరిశోధన ఇంటర్న్‌షిప్‌లు కల్పిస్తే, అది వారి భవిష్యత్తు వృత్తి జీవితానికి ప్రయోజనం చేకూరుస్తుందని అన్నారు. మనం నిర్మించుకుంటున్న వికసిత్ భారత్ కోసం ప్రపంచ దేశాల తలుపులు మన విద్యార్థుల కొరకు తెరిచే ఉన్నాయని కేంద్రమంత్రి అన్నారు. దేశీయ తయారీ రంగానికి కొత్త ఊపునిస్తూ, నూతన ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తున్న సరికొత్త ఉచిత వాణిజ్య ఒప్పందాల ద్వారా లభిస్తున్న అవకాశాలను విద్యార్థులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఎన్‌హెచ్ఎల్ఎంఎల్ ప్రాజెక్టుల పురోగతిపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సమీక్ష..
## మల్టీమోడల్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని పిలుపు



న్యూఢిల్లీ, జులై 7:దేశవ్యాప్తంగా రవాణా రంగాన్ని ఆధునీకరించేలా నిర్మిస్తున్న మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కులు (ఎంఎంఎల్‌పీ) రోప్‌వేలు, ఇంటర్ మోడల్ స్టేషన్లు, రహదారుల వెంబడి ఉండే ప్రయాణికుల వసతుల ప్రగతిపై కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ న్యూఢిల్లీలో నేడు ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారుల లాజిస్టిక్స్ నిర్వహణ సంస్థ (ఎన్‌హెచ్ఎల్ఎంఎల్) ఆధ్వర్యంలో దేశవ్యాప్త ంగా సాగుతున్న వివిధ ప్రాజెక్టుల క్షేత్రస్థాయి పురోగతిని ఈ సమావేశంలో మంత్రి సమీక్షించారు.

భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా, అన్ని రవాణా మార్గాలను అనుసంధానించే సమగ్ర రవాణా వ్యవస్థను నిర్మించడంలో ఈ విప్లవాత్మక ప్రాజెక్టులు అత్యంత వ్యూహాత్మకమైనవని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఇవి వివిధ రవాణా మార్గాల మధ్య అనుసంధానతను బలోపేతం చేయడమే కాకుండా, సరికొత్త ఆర్థిక అవకాశాలను సృష్టిస్తాయని తెలిపారు. అలాగే ప్రాంతీయ అసమానతలను తొలగించి సమతుల్య అభివృద్ధిని ప్రోత్సహించడంతో పాటు, అంతర్జాతీయ మార్కెట్లో భారతదేశపు లాజిస్టిక్స్ పోటీతత్వాన్ని ఇవి గణనీయంగా పెంచుతాయని మంత్రి వివరించారు.

ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న కీలక సవాళ్లు, ఆటంకాలను పరిశీలించిన కేంద్రమంత్రి... పనులకు అడ్డుపడుతున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో వెంటనే పరిష్కరించి, ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాలని సంబంధిత భాగస్వాములందరినీ ఆదేశించారు. ఈ ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడం ద్వారా దేశంలో లాజిస్టిక్స్ సామర్థ్యం పెరుగుతుందని, రవాణా ఖర్చులు తగ్గుతాయని ఆయన స్పష్టం చేశారు. ప్రయాణికులకు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఆధునిక వసతులు అందుబాటులోకి రావడం ద్వారా వికసిత భారత్, ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతను మరింత ముందుకు తీసుకెళ్లవచ్చని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.

# సింగరేణిపై ప్రేమ ఉంటే కొత్త బొగ్గు బ్లాకులు ఇప్పించండి!




కరీంనగర్, జులై 7:గని కార్మికుల యూనిఫాం ధరించి నంత మాత్రాన సింగరేణిపై ప్రేమ ఉన్నట్లు కాదని, నిజంగా సింగరేణి బొగ్గు పరిశ్రమపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ప్రేమ ఉంటే సంస్థకు కొత్త బొగ్గు బ్లాకులు ఇప్పించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు.

మంగళవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా కొనసాగుతున్న కిషన్‌రెడ్డి తెలంగాణలోని బొగ్గు పరిశ్రమకు మేలు చేసే విధంగా పనిచేయాలని కోరారు. బొగ్గు పరిశ్రమ మనుగడ కోసం కేంద్ర ప్రభుత్వం సహకరించాలని, సింగరేణి పరిరక్షణ కోసం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం పూర్తి స్థాయిలో కృషి చేస్తోందని అన్నారు.

హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డి నిర్వహించిన రివ్యూతో సింగరేణి సంస్థకు ఎలాంటి ప్రయోజనం లేదని ఆయన విమర్శించారు. ఆ సమావేశం ఎవరి ప్రయోజనాల కోసం నిర్వహించారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. కొత్త బొగ్గు బ్లాకుల అంశంపై నిర్వహించిన రివ్యూలో ఎలాంటి స్పష్టత ఇచ్చారో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

కొయ్యగూడెం-సత్తుపల్లి బొగ్గు బ్లాకులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం నిబంధనలకు విరుద్ధమని, బొగ్గు నిల్వలపై విచారణకు సింగరేణి అధికారులతోనే కమిటీ ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని రాజిరెడ్డి అన్నారు.

టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తి మాటాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసింది బీజేపీ ప్రభుత్వమేనని ఆరోపించారు. కోల్ పరిశ్రమ పరిరక్షణకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. ఎన్ని కష్టాలు ఎదురైనా సింగరేణి సంస్థను కాపాడుకుంటామని, కార్మికుల హక్కుల సాధనలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.

ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు పార్లపల్లి రవి, జావిద్ పాషా, పోలాడి శ్రీనివాసరావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ఎవరెన్ని కుట్రలు చేసినా అమరావతే ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధాని

విజయవాడ, జులై 7: ఆంధ్రప్రదేశ్‌కు ఎప్పటికీ అమరావతే రాజధానిగా ఉంటుందని, ఎవరెన్ని కుట్రలు చేసినా అమరావతిని విచ్ఛిన్నం చేయలేరని టీడీపీ నాయకులు గద్దె క్రాంతి స్పష్టం చేశారు. మంగళవారం గద్దె క్రాంతి కుమార్ 14వ డివిజన్ చిన వంతెన సెంటర్ చైత్ర స్కూల్ ఏరియాలో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు డ్రైనేజి సమస్య ఉన్నట్లు తెలిపారు. అనంతరం ముస్లిం మహిళ షేక్ ఫాతిమాకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ జగన్ తాజాగా ఎన్నికల మేనిఫెస్టోలో "మావిగన్" పేరుతో అంశాన్ని చేర్చుతామని చెప్పడం చూస్తే, వైసీపీకి ఇప్పటికీ అమరావతిపై ఉన్న వ్యతిరేక వైఖరి ఏమాత్రం మారలేదని విమర్శించారు. ప్రజలను గందరగోళానికి గురిచేయడమే వారి లక్ష్యంగా కనిపిస్తోందన్నారు. 2014లో అసెంబ్లీ సాక్షిగా అమరావతిని రాజధానిగా అంగీకరిస్తున్నామని చెప్పిన జగన్, 2019 ఎన్నికల సమయంలో తన ఇల్లు కూడా అమరావతిలోనే ఉందని తాను అమరావతికి కట్టుబడి ఉన్నానని చెప్పిన విషయాలు గుర్తు చేశారు.

తదుపరి 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకువచ్చి రాష్ట్రాభివృద్ధిని దెబ్బతీశారని ఆరోపించారు. ఇప్పుడు మరోసారి మావిగన్ పేరుతో కొత్త వాదనను ముందుకు తేవడం ద్వారా రాజధాని అంశంపై వైసీపీకి ఎలాంటి స్థిరమైన విధానం లేదని స్పష్టమవుతోందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఎప్పటికప్పుడు మాటలు మార్చడం జగన్‌కు, వైకాపా వారికి అలవాటుగా మారిందని విమర్శించారు. అమరావతి కోసం వేలాది మంది రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చి రాష్ట్ర భవిష్యత్తు కోసం త్యాగం చేశారని, అలాంటి రైతుల ఆకాంక్షలను దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నీ ప్రజలు సహించరని అన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అమరావతి నిర్మాణం వేగంగా కొనసాగుతోందని, రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు రావడానికి అమరావతే కేంద్రబిందువుగా నిలుస్తుందని పేర్కొన్నారు. అమరావతి అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేసే వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని గద్దె క్రాంతి అన్నారు. ఈ కార్యక్రమంలో కర్ణా రమేష్, నర్రా కిషోర్, గరికిపాటి బద్రి, యడ్లపల్లి నాగరాజు, వీరంకి డాంగే కుమారి, కోటేశ్వరరావు, రేపాకుల ప్రసాద్, రమేష్, సుంకర వెంకన్న, పీ.వి.ఆర్, పానేం వెంకటేశ్వర్లు, దండేంపల్లి ఆంజనేయులు, గవిడి లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

# 'విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు 17వ జాతీయ యువజన పార్లమెంటు పోటీ 2024-25' బహుమతుల పంపిణీ కార్యక్రమం

న్యూఢిల్లీ, జులై 7: 'విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు 17వ జాతీయ యువజన పార్లమెంటు పోటీ 2024-25' బహుమతుల పంపిణీ కార్యక్రమాన్ని 2026 జులై 7వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహిం చనున్నారు. ఈ కార్యక్రమాన్ని న్యూఢిల్లీ పార్లమెంట్ భవన సముదాయంలో గల పార్లమెంట్ గ్రంథాలయ భవనం జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో ఏర్పాటు చేశారు.

కార్యక్రమానికి కేంద్ర చట్ట, న్యాయ శాఖ సహాయ మంత్రి, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ అర్జున్ రామ్ మేఘ్‌వాల్ అధ్యక్షత వహిస్తారు. పోటీలో ప్రతిభావంతమైన ప్రదర్శనకు గాను బహుమతులను గెలుచుకున్న విద్యార్థులతో పాటు విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు బముమతులను పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా జమ్మూ కాశ్మీరుకు చెందిన కాశ్మీర్ విశ్వవిద్యాలయం విద్యార్థులు యువజన పార్లమెంటు సమావేశాలను మరోసారి ప్రదర్శిస్తారు. వీరు విశ్వవిద్యాలయాలు, కళాశాలల 17వ 'జాతీయ యువజన పార్లమెంటు పోటీ' 2024-25లో మొదటి స్థానంలో నిలిచారు.

'విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు యువజన పార్లమెంటు పోటీల'ను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గత 29 సంవత్సరాలుగా నిర్వహిస్తోంది. ఈ శ్రేణిలో యువజన విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు యువజన పార్లమెంటు పోటీ పథకంలో భాగంగా 17వ పోటీని దేశంలో 51 యువజన విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు నిర్వహించారు.

యువతరంలో స్వీయ క్రమశిక్షణను, భిన్నాభిప్రాయాల పట్ల సహనం కలిగి ఉండటాన్ని, ఆలోచనలను నిష్పక్షపాతంతో వ్యక్తం చేయడాన్ని, ప్రజాస్వామిక జీవిత శైలికి సంబంధించిన ఇతర గుణాలను అలవరచడానికి ఉద్దేశించిందే ఈ యువజన పార్లమెంటు పథకం. దీనికి తోడు, ఈ పథకం విద్యార్థుల్లో పార్లమెంటు కార్య ప్రణాళిక, పద్ధతులు, చర్చలు, వాదోపవాదాల మెలకువలపై అవగాహనను కల్పిస్తుంది. వారిలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ సామర్థ్యం, ధాటిగా మాట్లాడే కళను పెంపొందింప చేస్తుంది.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి..

అమరావతి, జులై 7: ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మంగళవారం ఉరవకొండ ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు.

డిపో జేఏసీ నాయకులు నారాయణస్వామి, మాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో కార్మికులు పాల్గొని తమ డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించకుండా ఆర్టీసీ ద్వారానే కొనుగోలు, నిర్వహణ, మెయింటెనెన్స్, విధుల నిర్వహణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థగా ఆర్టీసీని మరింత బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి: ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్, జులై 7:అచ్చంపేట పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆవరణలో శ్రీ మహాలక్ష్మి మ్యాక్సీ విజన్ ఈహెచ్ఎస్ ఐ హాస్పిటల్ సహకారంతో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రారంభించారు. అనంతరం ఆయన స్వయంగా కంటి పరీక్షలు చేయించు కున్నా రు. ఉదయం నుంచి కొనసాగిన ఈ శిబిరానికి అచ్చంపేటతో పాటు పరిసర గ్రామాల నుంచి వందలాది మంది ప్రజలు హాజరై కంటి పరీక్షలు చేయించు కున్నారు. వైద్య నిపుణులు ప్రతి ఒక్కరికీ సమగ్రంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, వైద్య సలహాలు అందించారు. కంటి శుక్లాలు (క్యాటరాక్ట్) ఉన్నట్లు గుర్తించిన రోగులకు ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన అర్హులకు ఈ శస్త్రచికిత్సలు పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ మాట్లా డుతూ, కంటి చూపు మనిషికి భగవంతుడు ప్రసాదించిన అమూల్య మైన వరమని, చిన్న చిన్న సమ స్యలను నిర్లక్ష్యం చేయ కుండా ప్రతి ఒక్కరూ నిరంతరం కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

# కొచ్చిలో నేటి నుంచి బ్రిక్స్ మహిళా వర్కింగ్ గ్రూప్ సమావేశం ప్రారంభం

న్యూ ఢిల్లీ, జులై 7:కొచ్చి, జూలై 6, 2026: భారత్ అధ్యక్షతన బ్రిక్స్ సదస్సు-2026 ఆధ్వర్యంలో బ్రిక్స్ మహిళా వర్కింగ్ గ్రూప్ (డబ్ల్యూడబ్ల్యూజీ) సమావేశం కేరళలోని కొచ్చిలో ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉన్నత స్థాయి సమావేశంలో బ్రిక్స్ సభ్య దేశాలకు చెందిన సీనియర్ ప్రభుత్వ అధికారులు పాల్గొంటున్నారు. మహిళా సాధికారత, మహిళల నేతృత్వంలో అభివృద్ధి వంటి కీలక అంశాలపై చర్చించడంతోపాటు, పరస్పర ప్రయోజనాలు కలిగిన రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా ఈ సదస్సు సాగుతోంది.

ఈ సమావేశానికి విచ్చేసిన ప్రతినిధులకు కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీ అనిల్ మాలిక్ ఘనంగా స్వాగతం పలికారు. భౌగోళిక సరిహద్దులు మనల్ని భౌతికంగా దూరంగా ఉంచినప్పటికీ, మహిళా సాధికారతను పెంపొందించాలనే మన ఉమ్మడి సంకల్పమే మనల్ని ఇంత దగ్గరగా చేర్చిందని పేర్కొన్నారు. ఈ రెండు రోజుల సమావేశం అర్థవంతమైన చర్చలకు, పరస్పర అభ్యాసానికి, నిర్మాణాత్మక సహకారానికి వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళల అభ్యున్నతి కోసం బ్రిక్స్ దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ సదస్సు మరింత బలోపేతం చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

భారతదేశ బ్రిక్స్ అధ్యక్షత కాలంలో మహిళా సాధికారత విభాగం ప్రధానంగా నాలుగు కీలక ప్రాధాన్యత రంగాల ఆధారంగా ముందుకు సాగుతోందని అనిల్ మాలిక్ వివరించారు. బ్రిక్స్ దేశాల ఉమ్మడి ఆకాంక్షలు, ప్రస్తుత ప్రపంచ సవాళ్లను ప్రతిబింబించేలా ఈ రంగాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వాటిలో మొదటిది.. మహిళల పాలన, నాయకత్వం ద్వారా మరింత పటిష్టమైన బ్రిక్స్ కూటమిని నిర్మించడం, రెండోది.. మార్పునకు చోదక శక్తులుగా ఆర్థిక, డిజిటల్ రంగాలలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, మూడోది.. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, వారి నైపుణ్యాభివృద్ధికి తోడ్పడటం, నాల్గవది.. వాతావరణ మార్పుల నియంత్రణ చర్యలు, ఆహార భద్రత, పోషకాహార లభ్యతలో మహిళల పాత్రను మరింత బలోపేతం చేయడం.

గత కొన్ని నెలలుగా జరిగిన వివిధ కార్యక్రమాలకు ఈ ప్రాధాన్యతా రంగాలు ఒక బలమైన వేదికను అందించాయని, కొచ్చి సమావేశంలో జరిగే చర్చలకు కూడా ఇవే దిశానిర్దేశం చేస్తాయని కేంద్ర కార్యదర్శి అనిల్ మాలిక్ పేర్కొన్నారు.

ఈ సదస్సు కోసం జరిగిన ముందస్తు సంప్రదింపుల సమయంలో సభ్య దేశాలు ప్రదర్శించిన నిర్మాణాత్మక వైఖరి, రాబోయే రెండు రోజుల చర్చల్లోనూ కొనసాగుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. దీని వల్ల వివిధ దేశాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను పంచుకోవడానికి, ఉమ్మడి అవగాహనను పెంపొందించుకోవడానికి, ఈ సమావేశ నిర్ణయాలపై ఒక సమష్టి ఒప్పందానికి రావడానికి వీలవుతుందని తెలిపారు.

భారతదేశ అధ్యక్షతన బ్రిక్స్ సదస్సు ఇతివృత్తమైన "స్థితిస్థాపకత, ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" నినాదానికి అనుగుణంగా ఈ చర్చలు జరుగుతున్నాయి. ఈ ఇతివృత్తం ప్రధానంగా ప్రజల సంక్షేమానికి, మానవత్వమే ప్రథమం అనే విధానానికి పెద్దపీట వేస్తుంది. కొచ్చిలో ప్రస్తుతం జరుగుతున్న ఈ మహిళా వర్కింగ్ గ్రూప్ సమావేశం ముగిసిన వెంటనే జూలై 8, 9 తేదీల్లో రెండు రోజుల పాటు బ్రిక్స్ దేశాల మహిళా మంత్రుల స్థాయి సదస్సు కూడా ఇక్కడే జరగనుంది.

# చిన్నారుల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట..



కరీంనగర్, జులై 7:చిన్నారుల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

మంగళవారం జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం యశ్వంత్‌రావుపేట గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.12 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ప్రీ-ప్రైమరీ విద్యను అందిస్తోందని తెలిపారు. బాలింతలు, గర్భిణీల ఆరోగ్య పరిరక్షణ విషయంలో కూడా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వివరించారు.

అంగన్‌వాడీ సేవలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది మరింత అంకితభావంతో పని చేస్తూ లబ్ధిదారులకు నాణ్యమైన సేవలు అందించాలని కోరారు. ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతం చేయడంలో అంగన్‌వాడీ కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉరుమట్ల లక్ష్మీ బుచ్చయ్య, మాజీ జెడ్పీటీసీ బాధినేని రాజేందర్, బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సర్సాగౌడ్లు తదితరులు పాల్గొన్నారు.

# హిసార్, రోహ్‌తక్ జిల్లాల్లోని మూడు ఆసుపత్రులకు వెళ్లినా దక్కని వెంటిలేటర్...
# 24 గంటల నరకం తర్వాత హర్యానాలో నవజాత శిశువు మృతి

న్యూఢిల్లీ, జులై 7:హర్యానాలోని హిసార్, రోహ్‌తక్ జిల్లాల్లో మూడు పెద్ద ఆసుపత్రులు తిరిగినా దాదాపు 24 గంటల పాటు వెంటిలేటర్ సౌకర్యం దొరకకపోవడంతో ఒక నవజాత శిశువు మృతి చెందిన ఉదంతంపై జాతీయ మానవ హక్కుల సంఘం తీవ్రంగా స్పందించింది. పత్రికలలో వచ్చిన ఈ కథనాన్ని కమిషన్ సుమోటోగా స్వీకరించింది. మీడియా నివేదికల ప్రకారం... ఆ నవజాత శిశువు తండ్రి తన బిడ్డకు వెంటిలేటర్ సౌకర్యం కోసం హిసార్, రోహ్‌తక్ జిల్లాల్లోని ఒక ఆసుపత్రి నుంచి మరో ఆసుపత్రికి తిరిగినప్పటికీ ఎక్కడా వెంటిలేటర్ లభించకపోవడంతో చివరకు ఆ పసికందు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది.

వార్తా కథనాల్లోని అంశాలు నిజమైతే అవి తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని ఎన్‌హెచ్ఆర్‌సీ పేర్కొంది. ఈ దారుణ ఘటనపై రెండు వారాల్లోగా పూర్తి వివరాలతో కూడిన నివేదికను సమర్పించాల్సిందిగా హర్యానా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది.

జూలై 3న వెలువడిన మీడియా నివేదికల ప్రకారం... జూలై 1న హర్యానాలోని హిసార్ సివిల్ ఆసుపత్రిలో ఒక మహిళకు సిజేరియన్ కాన్పు ద్వారా మగబిడ్డ జన్మించాడు. అయితే, పుట్టిన వెంటనే ఆ శిశువుకు అత్యవసరంగా వెంటిలేటర్ మద్దతు అవసరమైంది. అక్కడి వైద్యులు తొలుత ఆ శిశువును హిసార్ జిల్లాలోని అగ్రోహా మెడికల్ కళాశాలకు సిఫార్సు చేశారు. కానీ అగ్రోహాలో కూడా వెంటిలేటర్ ఖాళీగా లేదని సివిల్ ఆసుపత్రి వర్గాలు నిర్ధారించడంతో శిశువును రోహ్‌తక్‌లోని పీజీఐఎంఎస్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా వెంటిలేటర్ దొరకకపోవడంతో బిడ్డను తిరిగి హిసార్‌కు తీసుకువచ్చి ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన ప్రైవేటు వైద్యులు ఆ పసికందు అప్పటికే మరణించినట్లు ప్రకటించారు.

# గంజాయిపై పోలీసుల ఉక్కుపాదం



అమరావతి, జులై 7: నాయుడుపేట పట్టణంలో గంజాయి నిర్మూలనకు పోలీసులు మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని బహిరంగ ప్రదేశాలు, నిర్మానుష్య ప్రాంతాలు, అనుమానిత ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి విక్రయాలు, వినియోగం జరుగుతున్నట్లు సమాచారం అందిన ప్రాంతాలను ప్రత్యేకంగా పరిశీలించి, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టారు.

ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు, డీఎస్పీ చెంచుబాబు ఆదేశాల మేరకు గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనుమానితులకు కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నామని, గంజాయి విక్రయించినా, సేవించినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం స్థానిక ప్రజలు, మహిళలతో సమావేశమై గంజాయి వంటి మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. ఎక్కడైనా గంజాయి విక్రయాలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతో నాయుడుపేటను మాదకద్రవ్యాల రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు పోలీసు శాఖ కట్టుబడి ఉందని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

# మంత్రి సహకారంతో ఊట్కూర్‌కు క్రీడా మైదానం..

## –భూ సర్వే పూర్తి, త్వరలో నిర్మాణం ప్రారంభం.



మహబూబ్‌నగర్, జులై 7:నారాయణపేటజిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా క్రీడాకారులు ఎదురుచూస్తున్న క్రీడా మైదానం కల త్వరలో సాకారం రాష్ట్ర పాడి పరిశ్రమ, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సహకారంతో రూ. 2.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న క్రీడా మైదానం కోసం మంగళవారం భూ సర్వే పనులు చేపట్టారు. త్వరలోనే నిర్మాణ పనులను ప్రారంభించి, వేగంగా పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువస్తామని ఊట్కూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు చింతన్‌పల్లి సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు.మంత్రి ప్రత్యేక చొరవతో ఊట్కూర్ మండల కేంద్ర శివారులో ప్రతిపాదించిన స్థలంలో అధికారులు మంగళవారంభూ సర్వే నిర్వహించారు.

ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ఊట్కూర్ మండలం నుంచి జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రతిభ కనబరిచిన అనేక మంది క్రీడాకారులు ఉన్నప్పటికీ సరైన క్రీడా మైదానం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

ఈ సమస్యను మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి రూ. 2.50 కోట్ల నిధులు మంజూరు చేయించారని అన్నారు.

నిర్మించనున్న క్రీడా మైదానంలో అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో తదితర క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.

మైదానం అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రాంత యువత తమ ప్రతిభను మరింత మెరుగు పర్చుకునే అవకాశం లభిస్తుందని, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మరిన్ని విజయాలు సాధించే అవకాశాలు పెరుగుతాయని అన్నారు.క్రీడలను ప్రోత్సహించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా మెరుగైన క్రీడా వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. క్రీడా మైదానం పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డి వై ఎస్ ఓ శెట్టి వెంకటేష్, ఆర్ఐ కృష్ణారెడ్డి, రాష్ట్ర సర్వే బృందం అధికారులు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కోరం మహేష్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు కొక్కు లింగం, నాయకులు జలాల్ ,చందు లక్ష్మణ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# జూలై 8 నుంచి 9, 2026 వరకు కొచ్చిలో బ్రిక్స్ దేశాల మహిళా మంత్రివర్గ సమావేశానికి ఆతిథ్యం ఇవ్వనున్న భారత్

న్యూఢిల్లీ, జులై 7:భారత్ అధ్యక్షతన బ్రిక్స్ సదస్సు-2026 నిర్వహణ నేపథ్యంలో జూలై 8 నుంచి 9, 2026 వరకు కేరళలోని కొచ్చిలో బ్రిక్స్ దేశాల మహిళా మంత్రివర్గ సమావేశం జరుగుతుంది. పరస్పర సహకారాన్ని బలోపేతం చేయటం, మహిళా సాధికారతను పెంపొందించటం.. సమ్మిళితమైన, పటిష్ఠమైన, స్థిరమైన అభివృద్ధి పట్ల ఉమ్మడి నిబద్ధతను స్పష్టం చేసేందుకు బ్రిక్స్ సభ్య దేశాల మంత్రులు, ప్రతినిధుల బృందాలు ఒకచోట సమావేశం అవుతారు.

భారత్ అధ్యక్షతన బ్రిక్స్ సదస్సు నాలుగు ప్రధాన అంశాలపై ఆధారపడి ఉంది. దృఢత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత. ప్రతి రంగంలోనూ మహిళల సాధికారతను పెంపొందించే విధంగా బ్రిక్స్ మహిళా విభాగాన్ని రూపొందించారు.

జూలై 6 నుంచి 7, 2026వ తేదీ వరకు బ్రిక్స్ ఉమెన్ వర్కింగ్ గ్రూప్ సమావేశం అనంతరం ఈ మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. సీనియర్ అధికారులు ఈ వర్కింగ్ గ్రూప్ సమావేశంలో బ్రిక్స్ ఉమెన్ ట్రాక్ పరిధిలోని ప్రాధాన్యతా రంగాలపై విస్తృత చర్చలు జరిపారు. ఉమెన్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేసిన బలమైన పునాదుల ఆధారంగా బ్రిక్స్ సభ్య దేశాల మధ్య సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లటానికి ప్రతిపాదిత ఫలితాలపై మంత్రులు చర్చించి, వ్యూహాత్మక దిశా నిర్దేశం చేయనున్నారు.

ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ.. మానవత్వమే పరమావధిగా సాగే విధానాన్ని ప్రతిబింబించేలా భారత్ అధ్యక్షతన బ్రిక్స్ సదస్సు "పటిష్టత, ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" ఇతివృత్తంతో ఈ మంత్రివర్గ సమావేశం జరగనుంది. మహిళల నాయకత్వాన్ని ప్రోత్సహించటం, ఆర్థిక అవకాశాలను విస్తరించటం, డిజిటల్ ఆర్థిక సమగ్రతను బలోపేతం చేయటం, వ్యవస్థాపకతను పెంపొందించటం, వాతావరణ చర్యలు, ఆహార భద్రత, పోషకాహార రంగాల్లో మహిళల సహకారాన్ని గుర్తించటం వంటి అంశాలపై ఉన్నత స్థాయి చర్చలకు ఈ సమావేశం వేదికగా నిలుస్తుంది. లింగ సమానత్వం దిశగా ఆచరణాత్మక సహకారాన్ని పెంపొందించేందుకు పురోగతిని వేగవంతం చేయటానికి బ్రిక్స్ సభ్య దేశాల ఉమ్మడి ఆకాంక్షను ఈ చర్చలు ప్రతిబింబిస్తాయి.

గ్రామీణాభివృద్ధి, స్టెమ్, పోషకాహారం, విద్య, మరిన్ని విభిన్న రంగాల్లో మహిళల నేతృత్వంలోని అభివృద్ధిలో భారత్ సాధించిన విజయాలను తెలియజేసే ప్రదర్శనలు ఈ మంత్రిత్వ స్థాయి సమావేశానికి అదనపు ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఒక ప్లీనరీ సెషన్, ప్రముఖ నిపుణులు, విధాన నిర్ణేతలు, నిపుణులతో కూడిన నేపథ్య ప్యానెల్ చర్చలుంటాయి. ఇవి అనుభవాలను పంచుకునేందుకు, వినూత్న విధానాలను మార్పిడి చేసుకునేందుకు, మహిళా సాధికారతకు భాగస్వామ్యాలను పెంపొందించుకునేందుకు ఒక మంచి అవకాశాన్ని అందిస్తాయి.

# జగన్నాథ రథయాత్ర విజయవంతం కావడానికి నగర ప్రజలు సహకరించాలి

## –కరీంనగర్ సీపీ గౌస్ ఆలమ్, ఐపిఎస్




హైదరాబాద్, జులై 7:కరీంనగర్ ఇస్కాన్ శ్రీ రాధా గోవింద మందిరం, జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ సంయుక్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన జగన్నాథ రథయాత్ర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు కరీంనగర్ పట్టణ భక్తకోటి సహకరించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలమ్ సూచించారు. ఈ రోజు ఇస్కాన్ నరహరి ప్రభు జీ నేతృత్వంలో జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ సభ్యులు సీపీ గౌస్ ఆలమ్‌ను కలిసి ఆహ్వాన పత్రం అందజేసి జిల్లా పోలీసు యంత్రాంగం సహాయసహకారాలను కోరగా స్పందించిన సీపీ మాట్లాడుతూ, ఈ రథయాత్ర సాఫీగా, ప్రశాంతంగా, భక్తి ప్రపత్తులతో కొనసాగడానికి కావలసిన భారీ పోలీసు బందోబస్తు ఏర్పాట్లను చేస్తామని, నిర్వాహకులు సహకరించి భక్తులను చైతన్య పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నరహరి ప్రభు జీ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన రథయాత్రతో పోల్చితే ఈ సారి భక్తులు అధికంగా పాల్గొంటారని, దానికి అనుగుణంగా భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా: నరహరి ప్రభు జీతో పాటు ఉత్సవ కమిటీ అధ్యక్షులు కన్న కృష్ణ, సభ్యులు డాక్టర్ ఎల్ రాజభాస్కర్ రెడ్డి, లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, కొమురవెల్లి వెంకటేశం, రాళ్లబండి గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

# ఓటర్ సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి..

నిజామాబాద్, జులై 7:ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని బిక్కనూర్ మండల బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ చెప్పారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు నిజమైన ఓటరు పేరు తొలగకుండా చూడవలసిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉందని చెప్పారు. ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్యానికి ప్రాణం లాంటిదని తెలిపారు.

నకిలీ ఓట్లు డబ్బులు ఎంట్రీలు తొలగించడం కోసం ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఎంతో అభినందనీయమని చెప్పారు. మండల కేంద్రం తో పాటు గ్రామాలలో బిఎల్ఓ సిబ్బంది మొక్కుబడిగా కాకుండా బాధ్యతగా పనిచేయాలన్నారు ప్రతి ఇంటి సందర్శించి ఖచ్చితమైన సమాచారం సేకరించాలని ఆయన సూచించారు. బిఆర్ఎస్ పార్టీ తరఫున సిబ్బందికి పూర్తి సహకారం అందించడం జరుగుతుందని తెలిపారు. మండలంలో 100% నిజమైన ఓటర్లు ఉండే విధంగా చూడాలని ఆయన సూచించారు. సమావేశంలో బిఆర్ఎన్ నాయకులు మహేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బసవయ్య ఉన్నారు.

# పేద కుటుంబాలకు వరం ఇందిరమ్మ ఇండ్లు..



నిజామాబాద్, జులై 7:పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇందు వరం లాంటివని కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారంభిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు పథకం కింద నిర్మించిన నూతన గృహాన్ని ప్రారంభించారు. అనంతరం గృహ యజమానులను పట్టు వస్త్రాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని ఆయన పేర్కొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుందని గుర్తు చేశారు. అట్టి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేష్, డీసీసీ కార్యదర్శి రాజబాబు గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జీవన్, ఉప సర్పంచ్ ప్రకాష్, మాజీ సర్పంచ్ నర్సింలు యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మమత సత్యం, ఆలయ కమిటీ డైరెక్టర్ కార్తీక్, నర్సింలు, రామస్వామి, బాలన్న, బాబు ఆనంద్, రవి, అనిల్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# పాన్ షాపులు, కిరాణా దుకాణాల్లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

హనుమకొండ జులై 7: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రంలోని పలు పాన్ షాపులు, కిరాణా దుకాణాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక సీఐ మహేందర్ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

ఈ తనిఖీల్లో నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గుట్కాలు, ఇతర మాదకద్రవ్యాలు నిల్వ ఉంచారా, విక్రయిస్తున్నారా అనే కోణంలో పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా సీఐ మహేందర్ మాట్లాడుతూ, గుట్కాలు, నికోటిన్ కలిగిన పొగాకు ఉత్పత్తులు లేదా ఇతర మాదకద్రవ్యాలను విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత పదార్థాలను నిల్వ ఉంచినా, రహస్యంగా విక్రయించినా అది నేరమేనని స్పష్టం చేశారు.

పాఠశాలల పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అక్రమంగా గుట్కాలు లేదా ఇతర మాదకద్రవ్యాలను విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్



వరంగల్, జులై 7: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం దుగ్గొండి మండలంలోని లక్ష్మీపురం, దుగ్గొండి, గోపాలపురం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటి సర్వే, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, ఓటరు వివరాల నమోదు, ధ్రువీకరణ ప్రక్రియను పరిశీలించిన ఆమె బీఎల్‌వోలు నిర్వహిస్తున్న పనితీరుపై ఆరా తీశారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి, ఓటరు జాబితా శుద్ధి ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని ఆదేశించారు.

పరిశీలన సందర్భంగా రైతులతో మాట్లాడిన కలెక్టర్ గ్రామాల్లో పంటల సాగు పరిస్థితులు, సాగు విస్తీర్ణం, సాగుచేస్తున్న పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగల పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు సూచించారు. అలాగే ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ ఇంటింటి సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలని బీఎల్‌వోలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, దుగ్గొండి తహసీల్దార్ సమ్మక్క, నర్సంపేట తహసీల్దార్ రవిచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ మీదుగా బుల్లెట్ ట్రైన్ నడిపించాలి

## –బీదర్ దక్షిత ప్రాంత ఎమ్మెల్యే శైలేంద్ర బెల్దలేను కోరిన జహీరాబాద్ అఖిలపక్షం నాయకులు



మెదక్, జులై 7:(నేటినిజం ప్రతినిధి)జహీరాబాద్ మీదుగా బుల్లెట్‌రైలు నడిపించేలా కేంద్ర రైల్వేశాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళ్లాలని కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ దక్షిత ప్రాంత ఎమ్మెల్యే శైలేంద్ర బెల్దలేను జహీరాబాద్ బుల్లెట్‌రైలు సాధన కమిటీ అఖిలపక్షం నాయకులు కోరారు. సోమవారం కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ పట్టణంలో ఎమ్మెల్యే శైలేంద్ర బెల్దలే నివాసంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అధ్యక్షతన అఖిలపక్షం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్-ముంబాయికి జహీరాబాద్ మీదుగా బుల్లెట్ రైలు వెళ్లేలా సంబంధిత రైల్వే మంత్రిత్వశాఖ మొదటి విడత డీఆర్‌పీ అలైన్‌మెంట్‌లో రూపొందించారన్నారు.

రెండో విడత డీఆర్‌పీ అలైన్‌మెంట్‌లో జహీరాబాద్‌కు బదులుగా కోకపేట్, వికారాబాద్ మీదుగా బుల్లెట్‌రైలు నడిపించేలా ప్రతిపాదనలు చేశారని పేర్కొన్నారు. బుల్లెట్‌రైలు దారి మళ్లింపుతో నిమ్జ్, స్మార్ట్‌సిటీ రూపుదిద్దుకుంటున్న జహీరాబాద్, బీదర్ ప్రాంత అభివృద్ధికి తీరని నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత రైల్వే ఉన్నతాధికారులను కలిసి జహీరాబాద్ ప్రాంతానికి బుల్లెట్ రైలు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రైల్వే శాఖ మంత్రి, సంబంధిత రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి జహీరాబాద్ మీదుగా బుల్లెట్‌రైలు నడిపించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే శైలేంద్ర బెల్దలే వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బుల్లెట్ రైలు అఖిలపక్షం నాయకులు , ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ శికకుమార్, గుండప్ప, భాస్కర్, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు : ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

సంగారెడ్డి, జులై 7: (నేటినిజం ప్రతినిధి):కళాశాలలు, హాస్టళ్లు ప్రారంభమైన నేపథ్యంలో నూతనంగా చేరిన విద్యార్థుల పట్ల సీనియర్ విద్యార్థులు స్నేహపూర్వకంగా, గౌరవప్రదంగా వ్యవహరించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. ర్యాగింగ్ అనేది చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని, విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు ఎలాంటి అవకాశం లేకుండా యాజమాన్యాలు, అధ్యాపకులు, విద్యార్థులు కలిసి కట్టుగా పనిచేయాలని తెలిపారు. నూతన విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేయడం, అవమానించడం, శారీరక లేదా మానసిక వేధింపులకు పాల్పడడం వంటి చర్యలు చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యాసంస్థల యాజమాన్యాలు యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. హాస్టళ్లలో వార్డెన్లు ప్రత్యేక నిఘా ఉంచి విద్యార్థులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని కోరారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ర్యాగింగ్ దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించి, ఎలాంటి వేధింపులు ఎదురైనా వెంటనే కళాశాల యాజమాన్యానికి లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.మెదక్ జిల్లా పోలీసు శాఖ విద్యాసంస్థల పరిసరాల్లో ప్రత్యేక నిఘా కొనసాగిస్తుందని, ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. విద్యార్థులు ఎలాంటి సమస్య ఎదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, వారి భద్రతకు జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

# గల్ఫ్ నుంచి వచ్చిన మూడ్రోజులకే ఘోరం! ఇంజెక్షన్ ఇచ్చి భర్త హత్య..

కామారెడ్డి, జులై 7:ప్రియుడి మోజులో పడిన ఓ ఇల్లాలు భర్తను దారుణంగా హతమార్చింది. గల్ఫ్ నుంచి వచ్చిన మూడ్రోజులకే బంగ్లా పైనుంచి తోసేసింది. గాయాలతో బయటపడి దవాఖానలో చేరిన భర్తను కిరాతకంగా అంతమొందించింది. సెలైన్‌లో టాయిలెట్ క్లీనర్ కలిపి ఎక్కించడంతో అతడు చనిపోయాడు. నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకున్న ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐ సురేశ్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోపాల్ మండలం న్యాల్‌కల్‌కు చెందిన ప్రశాంత్ (35), సంధ్య దంపతులు. కుటుంబ పోషణ నిమిత్తం ప్రశాంత్ కొన్నేండ్లుగా దుబాయ్‌కి వెళ్లి వస్తున్నాడు. నిజామాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానలో నర్సుగా పని చేసే సంధ్యకు అనిల్‌తో పరిచయం ఏర్పడింది. ఇది కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. రెండేండ్ల తర్వాత ప్రశాంత్ గత నెల 27న దుబాయ్ నుంచి తిరిగి వచ్చాడు.

అనిల్‌తో తన సంబంధాన్ని కొనసాగించేందుకు భర్తను అడ్డు తొలగించుకోవాలని సంధ్య పథకం వేసింది. తనకు పరిచయమున్న న్యాల్‌కల్ వాసి బంటితో పథకం రచించింది. జూన్ 29న ప్రశాంత్, బంటి కలిసి తమ ఇంటి దాబాపై మద్యం తాగేలా ఏర్పాట్లు చేసింది. ఫుల్లుగా మద్యం తాగిన భర్తను సంధ్య, బంటి కలిసి దాబా పైనుంచి కిందికి తోసేశారు. కానీ ప్రశాంత్ గాయాలతో బయట పడటంతో ప్రైవేట్ దవాఖానలో చికిత్స చేయించారు.

# మహర్ కుల సంఘం సమస్యలు పరిష్కరిస్తాం..

## –ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



ఆదిలాబాద్, జులై 7:ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, మహర్ కుల సంఘం నాయకులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, మహర్ కులస్తుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం నాయకులు అందజేసిన వినతిపత్రంలో గౌతమ బుద్ధుని జన్మదినమైన బుద్ధ పౌర్ణమిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని, వైశాఖ పౌర్ణమి రోజున బుద్ధ జయంతిని అధికారికంగా నిర్వహించాలని, బౌద్ధ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 'ఈఎఫ్‌ల సేకరణ, ఫారాల డిజిటైజేషన్ వేగవంతం చేయాలి'

## –బీఎల్‌వోలకు ఆర్‌డీఓ మధు సూచన

ఖమ్మం, జులై 7:చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం కొత్తగూడెం ఆర్‌డీఓ, ఈఆర్‌వో మధు ఆధ్వర్యంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఓటర్ల నుండి ఎన్యూమరేషన్ ఫారాలు (ఈఎఫ్‌లు) సకాలంలో సేకరించి, వాటి డిజిటైజేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డీఓ సూచించారు. ప్రతి ఓటరుని చేరుకుని ఫారాల సేకరణను వేగవంతం చేయడంతో పాటు ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి తాసీల్దార్ నాగరాజు, విద్యానగర్ గ్రామ సర్పంచ్ లక్ష్మి, ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి, వార్డు సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయాలి : కలెక్టర్ దివాకర్ టీఎస్



ఖమ్మం, జులై 7: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా, పారదర్శకంగా అమలు చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధికారులను ఆదేశించారు. రాజకీయ పార్టీల సహకారంతో అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం తాసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ఓటరు జాబితా సవరణ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలని ఆదేశించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ వద్ద ఉన్న ఓటర్ల వివరాలను సంబంధిత బీఎల్‌ఓలకు అందజేసి ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ప్రజలకు ఎలాంటి సందేహాలు, ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అవగాహన కల్పిస్తూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు నిబంధనల మేరకు సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని కలెక్టర్ అధికా రులకు సూచించారు. ఈ కార్య క్రమంలో తాసీల్దార్ కె.సునీత, ఎలిజబెత్, ఆర్‌ఐలు రవి కుమా ర్, శ్రీషా, నాయకులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, బొగ్గుల శ్రీనివా సరెడ్డి, బొగ్గుల గోవర్ధన్ రెడ్డి, తల్లపురెడ్డి నాగిరెడ్డి,, పాల్గొన్నారు.

# మొక్కల పెంపకంతో ఆరోగ్యవంతమైన జీవనం

## –చండూరు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు



నల్గొండ, జులై 7: ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడం వల్ల స్వచ్ఛమైన గాలి లభించి ఆరోగ్యమైన జీవితం అనుభవించవచ్చని చండూరు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం చండూరు మున్సిపాలిటీలోనీ 10వ వార్డులో ఇంటింటికి హోమ్‌స్టెడ్ మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. "వన మహోత్సవం -2026" కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, ప్రతి ఇంటి ఆవరణలో పండ్ల, ఔషధ, నీడనిచ్చే మొక్కలను పెంచే లక్ష్యంతో చండూరు మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో ఇంటింటికి హోమ్‌స్టెడ్ మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రజలు మొక్కలను తమ ఇంటి ఆవరణలో నాటి, వాటిని సంరక్షించి చండూరు మున్సిపాలిటీని ఆకుపచ్చ వనం లాగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని ఆయన ప్రజలను కోరారు.

మొక్కలు పర్యావరణ సమతుల్యతను కాపాడటమే కాకుండా, స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవనానికి దోహదపడతాయని తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం మాట్లాడుతూ చండూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో కూడా హోమ్‌స్టెడ్ మొక్కల పంపిణీ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, కౌన్సిల్ సభ్యులు బుషిపాక వాసు, సామ సుజాతయాదవ రెడ్డి, జెల్ల ధనమ్మ శ్రీనివాస్, కొన్‌రెడ్డి మధు, కోడి సుష్మ వెంకన్న, కటకం రమేష్, కో-ఆప్షన్ సభ్యులు మొగుదాల సత్తమ్మ వెంకన్న, షేక్ ఖలీల్, షేక్ సలీమా షరీఫ్, మేనేజర్ జి.రాములు, సీనియర్ అసిస్టెంట్ ఏ. సాయిభారద్వాజ్, వార్డ్ ఆఫీసర్లు జి.శ్రీరాములు, ఎ.జగన్, బి. సాయిరాం, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ఎం.అరవింద్ రెడ్డి, బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# 'ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు'

## – అర్వపల్లి ఎస్‌ఐ మధు నాయుడు

నల్గొండ, జులై 7: అర్వపల్లి మండల కేంద్రంలోని వై జంక్షన్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దని ఎస్‌ఐ మధు నాయుడు అన్నారు. మంగళవారం రెండు జాతీయ రహదారులపై ఉన్న ఆక్రమణలు, రోడ్డుకు అడ్డంగా ఉంచిన వస్తువులు, అక్రమంగా నిలిపిన వాహనాలను పోలీసులు తొలగించారు. అలాగే పండ్లు, పూల వ్యాపారులు, టిఫిన్ సెంటర్ నిర్వాహకులు, ఇతర వ్యాపారులు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అలాగే రహదారిని ఆక్రమించకుండా వ్యాపారాలు నిర్వహించడం, రోడ్డుపై వాహనాలు నిలిపివేయకుండా ఉండడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఇకపై ఎవరైనా ఈ విషయాలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అచ్చంపేటలో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం




నల్గొండ, జులై 7: అచ్చంపేట పట్టణంలోని ఎస్సీ కాంప్లెక్స్ వద్ద మంగళవారం ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, ఉద్యమ నాయకుడు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేసి పరస్పరం మిఠాయిలు పంచుకున్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ మూడు దశాబ్దాలుగా పీడిత వర్గాల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతూ, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, ప్రమోషన్లలో రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల విస్తరణ వంటి అనేక అంశాల్లో కీలక విజయాలు సాధించిందన్నారు.

భవిష్యత్తులోనూ ప్రజల పక్షాన నిలిచి అణగారిన వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, కౌన్సిలర్ అంతటి శివ, శంకర్ మాదిగ, ఎంఎస్ఎఫ్ నాయకులు బుక్కపురం మహేష్, ఏలేటి బాలరాజ్, సౌట కాశీమ్, గద్దల కొండల్, గుద్దటి బాలరాజు, రాజగోపాల్, సౌట మహేష్, ఉదయ్, రాము, ప్రవీణ్, రాంప్రసాద్, రెబల్ అనిల్‌తో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 'కన్నెపల్లి పంప్ హౌస్‌ను తక్షణమే ప్రారంభించాలి'

## –ఆయకట్టుకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను విడుదల చేయాలి

## –సూర్యాపేట కలెక్టరేట్ కార్యాలయం వద్ద రైతులు, బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన

నల్గొండ, జులై 7: కన్నెపల్లి పంప్ హౌస్‌ను తక్షణమే ప్రారంభించి, ఎండిపోతున్న ఆయకట్టుకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట కలెక్టరేట్ కార్యాలయం వద్ద రైతులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు మంగళవారం భారీ ఆందోళన నిర్వహించాయి. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ ముఖ్య నాయకుల నేతృత్వంలో తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు, రైతులు కలెక్టరేట్ ముందు బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు, ఇతర ముఖ్య నాయకులు మాట్లాడారు.

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు ప్రమాదం పొంచి ఉందని, వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ప్రతి ఏటా సకాలంలో నీరందించి రైతాంగాన్ని ఆదుకున్న విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే కన్నెపల్లి పంప్ హౌస్ పునరుద్ధరణను నిర్లక్ష్యం చేస్తూ కాళేశ్వరం జలాలను ఆపాలని కుట్ర పన్నుతోందని తీవ్రంగా విమర్శించారు. రైతుల పొలాలు ఎండిపోతుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటోందని కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోయడానికి అన్ని అవకాశాలు ఉన్నప్పటికీ, కావాలనే కాలయాపన చేస్తూ రైతుల పొట్ట కొడుతున్నారని మండిపడ్డారు.

తక్షణమే కన్నెపల్లి పంప్ హౌస్‌ను యుద్ధప్రాతిపదికన ప్రారంభించి ఆయకట్టుకు నీరు విడుదల చేయాలని, సాగునీటి విషయంలో రాజకీయం పక్కనబెట్టి, రైతుల ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం పనిచేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ముట్టడితో అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం బీఆర్ఎస్ నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే గోదావరి జలాలను విడుదల చేయకుంటే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగాన్ని ఏకం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

# ఇరిగేషన్ శాఖలో భారీ పోస్టింగ్‌లు..

## –ఒకేసారి బదిలీలు, అదనపు బాధ్యతలు

కర్నూలు జులై 7: రాష్ట్ర జలవనరుల (ఇరిగేషన్) శాఖలో ప్రభుత్వం భారీ స్థాయిలో పరిపాలనా పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. జూన్ 30న పలువురు సూపరింటెండింగ్ ఇంజినీర్లు (ఎస్‌ఈలు), ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఈఈలు) పదవీ విరమణ చేయడంతో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేస్తూ ఒకేరోజు పలు ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఎనిమిది మంది అధికారులకు పూర్తి అదనపు బాధ్యతలు (ఫుల్ అడిషనల్ చార్జ్) అప్పగించగా, కీలక సూపరింటెండింగ్ ఇంజినీర్ పోస్టులకు ఇన్‌చార్జిలను నియమించింది. మరో విడతలో 28 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల బదిలీలకు ఆమోదం తెలిపింది.

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, పదవీ విరమణల కారణంగా ఏర్పడిన ఖాళీలతో పరిపాలనకు అంతరాయం కలగకుండా తాత్కాలికంగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇంజినీర్-ఇన్-చీఫ్ (అడ్మిన్), విజయవాడ ప్రతిపాదనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

### ఎనిమిది మందికి పూర్తి అదనపు బాధ్యతలు

విజయవాడ చీఫ్ ఇంజినీర్ (ఐఎస్ అండ్ డబ్ల్యూఆర్)గా టి. గిరిధర్ రావు, విజయనగరం టిటిపీఆర్ సర్కిల్ ఎస్‌ఈగా మమ్మద్నా రావు హనుమంతులు, ఏలూరు పీపీఆర్ఎంసీ సర్కిల్‌కు కె. శ్రీనివాసరావు, దవళేశ్వరం డిజైన్స్, ప్లానింగ్ అండ్ మానిటరింగ్ సర్కిల్‌కు ఎం. రాంబాబు, నెల్లూరు సోమశిల ప్రాజెక్టు సర్కిల్‌కు జి. రామచంద్రమూర్తి, విజయవాడ డిప్యూటీ ఇంజినీర్-ఇన్-చీఫ్ (అడ్మిన్)గా ఎ. సూర్యభాస్కర శర్మ, కడప కన్‌స్ట్రక్షన్ సర్కిల్-3కు దేశే నాయక్, నంద్యాల ఎస్‌ఆర్‌బీసీ సర్కిల్-2కు ఎస్. లక్ష్మీనాయక్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

### కర్నూలు, నంద్యాలకు కీలక బాధ్యతలు

పరిపాలనా అవసరాల దృష్ట్యా ఖాళీగా ఉన్న సూపరింటెండింగ్ ఇంజినీర్ పోస్టులకు కూడా ప్రభుత్వం ఇన్‌చార్జిలను నియమించింది. కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్‌గా ఆదోని టీబీపీ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి. సైలేశ్వర్‌ను నియమించింది. శ్రీశైలం ప్రాజెక్టు డ్యామ్ మెయింటెనెన్స్ సర్కిల్ బాధ్యతలను నంద్యాల ఎస్‌ఆర్‌బీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం. వేణుగోపాల్ రెడ్డికి అప్పగించింది. అలాగే చిత్తూరు, అనంతపురం, దవళేశ్వరం, ఏలూరు, విజయవాడలోని పలు కీలక సూపరింటెండింగ్ ఇంజినీర్ పోస్టులకు కూడా అదనపు బాధ్యతలు కేటాయించింది.

### 28 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల బదిలీలు

మరో ఉత్తర్వులో రాష్ట్రవ్యాప్తంగా 28 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల బదిలీలను ప్రభుత్వం ప్రకటించింది. నెల్లూరు వెంకటగిరి ఇరిగేషన్ డివిజన్‌కు కె. కోటేశ్వరరావు, కడప ఆర్‌డబ్ల్యూ అండ్‌ఎం డివిజన్‌కు టీ. జనార్ధన్ రెడ్డి, అనంతపురం హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ డివిజన్-8కు ఎం. రామసుబ్బయ్య, దవళేశ్వరం పోలవరం పీఐపీహెచ్‌డబ్ల్యూ డివిజన్-2కు లంక వెంకటేశ్వరరావు, చీరాల డ్రైనేజ్ డివిజన్‌కు పి. ప్రేమ్‌కుమార్, శ్రీశైలం ఎన్ఎస్‌ఆర్ఎస్ డ్యామ్ మెయింటెనెన్స్ డివిజన్‌కు కె. రవికుమార్‌లను నియమించింది.అదేవిధంగా నంద్యాల ఎస్‌ఆర్‌బీసీ డివిజన్-2 (బనగానపల్లె) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టుతో పాటు తిరుపతి టీజీపీ అండ్ జీఎన్ఎస్ఎస్ సర్కిల్‌లోని మరో పోస్టుకు స్థానికంగా తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని ఇంజినీర్-ఇన్-చీఫ్ (అడ్మిన్)ను ప్రభుత్వం ఆదేశించింది.

పదవీ విరమణలతో ఏర్పడిన ఖాళీల కారణంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, నిర్మాణ పనులు, పరిపాలనా వ్యవహారాలు ప్రభావితం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుంది.

ముఖ్యం గా కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ఎస్‌ఆర్‌బీసీ, శ్రీశైలం ప్రాజెక్టు, కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ వంటి కీలక విభాగాల్లో బాధ్యతలను వెం టనే భర్తీ చేయడం ద్వారా ప్రా జెక్టుల పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు మార్గం సుగమమైందని అధికారులు తెలిపారు.

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి

## –జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి, జూలై 7(నేటి నిజం ప్రతినిధి )ప్రజావాణి కార్యక్రమంలో అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు సత్వరంగా, పారదర్శకంగా పరిష్కరించడానికి చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు.

సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి వివరాలను తెలుసుకుని సంబంధిత శాఖల జిల్లా అధికారులకు వినతులను అందజేసి తగిన సూచనలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 66 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో జిల్లా కలెక్టరేట్‌లో 35, సంగారెడ్డి డివిజన్‌లో 13, ఆందోల్ డివిజన్‌లో 0, నారాయణఖేడ్ డివిజన్‌లో 6, జహీరాబాద్ డివిజన్‌లో 12 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆటోను ఢీకొట్టిన టిప్పర్ ఆటో డ్రైవర్ మృతి

హైదరాబాద్, జులై 7: హైదరాబాద్ -బీజాపూర్ జాతీయ రహదారి పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.

అతివేగంగా వచ్చిన టిప్పర్ ఆటోను ఢీకొనడంతో ఆటో డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని తాజ్ సర్కిల్ హోటల్ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లాకు చెందిన ఆటో డ్రైవర్ బతుకు దెరువు కోసం వలస వచ్చి మొయినాబాద్‌లో నివాసం ఉంటూ ఆటో నడుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

మంగళవారం పాల్సిలింగ్ కు సంబంధించిన మెటీరియల్‌ను ఆటో పై భాగంలో కట్టుకొని మొయినాబాద్ నుంచి చేవెళ్ల వైపు వెళ్తున్నాడు. మొయినాబాద్ మండల పరిధిలోని కనకమామిడి రెవిన్యూలో గల ప్రభుత్వ భూమి నుంచి టిప్పర్ మట్టిని తీసుకొని మొయినాబాద్ వైపు వస్తున్నది.

సరిగ్గా తాజ్ సర్కిల్ సమీపం వరకు రాగానే టిప్పర్ ఎదురుగా అతివేగంతో వచ్చి ఆటోను ఢీకొనడంతో ఆటో డ్రైవర్ అక్కడికి అక్కడే మృతి చెందాడు. టిప్పర్ డ్రైవర్ పరార్ అయ్యాడు. మృతదేహాన్ని చేవెళ్ల దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.


# భారత దేశం గర్వించదగ్గ ఆంగ్ల రచయిత రాజారావు

20 వ శతాబ్దపు ఆంగ్లంలో వ్రాసిన అత్యంత ముఖ్యమైన భారతీయ నవలా రచయితలలో రాజారావు ఒకరు. భారత దేశం గర్వించదగ్గ ఆంగ్ల రచయిత రాజారావు (1908 ? 2006) ఇంగ్లీషులో నవలలు, కథలు వ్రాసి, ప్రపంచ గుర్తింపు పొందారు.

రాజారావు 1908, నవంబరు 8వ తేదీన మైసూరు రాజ్యం (ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రం) లోని హసన్ పట్టణంలో ఒక స్మార్త బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన వారి తల్లి దండ్రులకు జన్మించిన 9 మంది సంతానంలో పెద్దవారు. ఆయనకు ఏడుగురు చెల్లెల్లు, ఒక తమ్ముడు యోగేశ్వరానంద ఉన్నారు. ఇతని తండ్రి హెచ్.వి.కృష్ణస్వామి హైదరాబాదు లోని నిజాం కళాశాలలో కన్నడ భాషను బోధించేవారు. ఇతని తల్లి గౌరమ్మ ఒక గృహిణి. ఇతడు 4 యేళ్ల వయసులో ఉన్నప్పుడు ఆమె మరణించింది.

ఇతడు నైజాం పరిపాలనలో ఉన్న ఆనాటి హైదరాబాదులోని మదరసా - ఎ - ఆలియాలో మెట్రిక్యులేషన్ వరకూ చదివారు. తరువాత తండ్రి పనిచేస్తున్న నిజాం కళాశాలలో డిగ్రీ చదివారు. తరువాత ఇతడు అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయంలో ఫ్రెంచి అధ్యయనం చేశారు. ఆ తర్వాత మద్రాసు విశ్వవిద్యాలయం నుండి ఇంగ్లీషు, చరిత్రలలో పట్టా పుచ్చుకున్నారు. హైదరాబాదు రాష్ట్ర ప్రభుత్వంచేత 1929లో ఏషియాటిక్ స్కాలర్‌షిప్ పొంది ఫ్రాన్స్‌లోని మొపెయి విశ్వ విద్యాలయం (జనితిలవతీబతిబిఎ నీట ఓనీనిబిజూవశ్రీశ్రీతివతీ)లో ఐరిష్ సాహిత్యంపై భారతీయ ప్రభావం అనే అంశంపై అధ్యయనం చేశాడు. 1931లో ఇతడు కేమిల్ మౌలీ అనే ఫ్రెంచి అధ్యాపకురాలిని వివాహం చేసుకున్నారు. 1939 వరకు వీరు కలిసి ఉన్నారు. తరువాత వీరి సంబంధం భగ్నమైంది. ఈ వైవాహిక జీవితం గురించి రాజారావు తన నవల "ది సెర్పెంట్ అండ్ ది రోప్"లో వర్ణించారు. 1939లో ఇతడు భారతదేశం తిరిగి వచ్చారు. 1942లో ఇతడు క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. 1943-1944లో ఇతడు బొంబాయి నుండి వెలువడిన "టుమారో" అనే పత్రికకు సహ సంపాదకుడిగా వ్యవహరించారు. "శ్రీ విద్యా సమితి" అనే సాంస్కృతిక సంస్థ ప్రారంభానికి ఆయన ముఖ్య కారకులు. ఇతడు "చేతన" అనే మరో సాంస్కృతిక సంస్థతో కూడా అనుబంధాన్ని కలిగి ఉన్నారు. ఇతడు 1966 నుండి 1986 వరకు ఆస్టిన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో తత్త్వశాస్త్రాన్ని బోధించారు. అక్కడ ఇతడు బోధించిన వాటిలో మార్క్సిజం నుండి గాంధీయిజం దాకా,

**జూలై 8... రాజారావు వర్ధంతి**



మహాయాన బౌద్ధము, భారతీయ తత్త్వము, ఉపనిషత్తులు మొదలైనవి ఉన్నాయి. 1965లో ఇతడు అమెరికన్ రంగస్థల నటి కేథరిన్ జోన్స్‌ను వివాహం చేసుకున్నారు. వారికి క్రిస్టఫర్ రామారావు అనే ఒక కుమారుడు కలిగారు. 1986లో ఆమెకు విడాకులు ఇచ్చి నూనన్ వాట్‌ను మూడవ వివాహం చేసుకున్నారు. నూనన్ 1970లో టెక్సాస్ యూనివర్సిటీలో ఇతని శిష్యురాలు. అయన

తన రచనా వ్యాసంగంపు తొలిదశలో ఫ్రాన్సు దేశంలో ఫ్రెంచి, ఇంగ్లీషు, కన్నడ భాషలలో కథలు వ్రాశాడు. 1939లో ఛేంజింగ్ ఇండియా అనే సంకలనానికి సంపాదకునిగా, విదర్ ఇండియా అనే పుస్తకాన్ని ఇక్బాల్ సింగ్‌తో కలిసి సహ సంపాదకునిగా ప్రచురించారు. జవహర్‌లాల్ నెహ్రూ వ్రాసిన సోవియట్ రష్యా సమ్ రాండమ్ స్కెచెస్ అండ్ ఇంప్రెషన్స్ అనే పుస్తకానికి సంపాదకుడిగా ఉన్నారు. ఇతడు జాతీయోద్యమంలో పాల్గొన్న అనుభవాలు ఇతని తొలి నవల "కాంతాపుర"లోను కథా సంకలనం "ది కౌ ఆఫ్ ది బ్యారికేడ్స్"లోను ప్రతిఫలించాయి. ఫ్రాన్స్ నుండి తిరిగి వచ్చిన చాలా కాలం తర్వాత 1960లో ఇతడు "ద సర్పెంట్ అండ్ ద రోప్" రచించారు. దీనిలో భారతీయ పాశ్చాత్య సంస్కృతుల మధ్య సంబంధాలను నాటకీయ ఫక్కీలో వర్ణించబడింది. ఈ నవల పేరులోని సర్పం (ావతీజూవనిబి), భ్రాంతికి, త్రాడు (ఖీనీజూవ), వాస్తవానికి ప్రతీకలు.

కాంతాపుర (1938), ద సర్పెంట్ అండ్ ద రోప్ (1960), ద క్యాట్ అండ్ షేక్స్‌పియర్: ఎ టేల్ ఆఫ్ ఇండియా (1965), కామ్రేడ్ కిరిలోవ్ (1976), ద చెస్ మాస్టర్ అండ్ హిజ్ మూవ్స్ (1988), ఆన్ ది గంగా ఘాట్ (1989), ద కౌ ఆఫ్ ది బ్యారికేడ్స్ (1947),

ద పోలీస్‌మాన్ అండ్ ద రోజ్ (1978), ద ట్రూ స్టోరీ ఆఫ్ కనకపాల, ఇన్ ఖందేష్, కంపేనియన్స్, ద కౌ ఆఫ్ ది బ్యారికేడ్స్అక్కయ్య, ద లిటిల్ గ్రామ్ షాప్, జవని, నిమ్క, ఇండియా ఎ ఫేబుల్, ద పోలీస్‌మాన్ అండ్ ద రోజ్; ఛేంజింగ్ ఇండియా: ఏన్ ఆంథాలజీ (1939); టుమారో (1943?44); విదర్ ఇండియా? (1948)

ద మీనింగ్ ఆఫ్ ఇండియా; వ్యాసాలు (1996); ద గ్రేట్ ఇండియన్ వే: ఎ లైఫ్ ఆఫ్ మహాత్మాగాంధీ, జీవిత చరిత్ర (1998), ద బెస్ట్ ఆఫ్ రాజారావ్ (1998), 5 ఇండియన్ మాస్టర్స్ (రాజారావు, రవీంద్రనాథ్ ఠాగూర్, ప్రేమ్‌చంద్, డా. ముల్క్ రాజ్ ఆనంద్, కుష్వంత్ సింగ్) (2003) తదితర రచనలు చేశారు.

రాజారావు భారతదేశపు అత్యున్నత గౌరవాలు పొందారు.

1964: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు; 1969: పద్మభూషణ్ పురస్కారం; 1988: న్యూస్టాట్ అంతర్జాతీయ సాహిత్య బహుమతి; 2007 లో మరణానంతరం పద్మ విభూషణ్ పురస్కారం లభించాయి.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# రాజన్న గుడి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలి

**జరిగిన నియామకాలపై విచారణ జరపాలి-చల్మెడ లక్ష్మీనరసింహారావు**



రాజన్న సిరిసిల్ల, జులై 7:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా నిరుద్యోగ యువతకు ప్రాధాన్యం కల్పిస్తూ రాజన్న ఆలయంలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను స్థానికులతోనే భర్తీ చేయాలని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు డిమాండ్ చేశారు.రాజన్న ఆలయంలో ఖాళీల భర్తీ విషయంలో గతంలో ఇంటర్వ్యూలు నిర్వహించినప్పటికీ, ప్రస్తుతం స్థానికులను పక్కనపెట్టి మంత్రుల సిఫారసులతో నియామకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలను ఆయన చేశారు. జిల్లాలో అర్హత కలిగిన వేలాది మంది నిరుద్యోగులు ఉన్నప్పటికీ వారికి అవకాశాలు కల్పించకపోవడం సరైంది కాదన్నారు.ఔట్‌సోర్సింగ్‌తో పాటు ఇతర ఉద్యోగాల భర్తీలోనూ పూర్తి పారదర్శకత ఉండాలని, ఖాళీల వివరాలను ముందుగా పత్రికల ద్వారా ప్రకటించి నోటిఫికేషన్ జారీ చేసి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. రహస్యంగా లేదా సిఫారసుల ఆధారంగా నియామకాలు చేపట్టడం వల్ల అర్హులైన స్థానిక యువత ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు.ఇప్పటికే జరిగిన ఔట్‌సోర్సింగ్ నియామకాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసిన ఆయన, స్థానిక నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుంటే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. జిల్లా యువతకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ఉంటే పూర్తి స్థాయి విచారణకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.భవిష్యత్తులో కూడా ఇదే తరహా నియామకాలు కొనసాగితే నిరుద్యోగ యువత ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించిన ఆయన, ఈ అంశంలో నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. రాజన్న ఆలయంలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను బహిర్గతం చేసి, స్థానికులకు ప్రాధాన్యం కల్పిస్తూ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# రాజన్న ఆలయ నియామకాలపై అవకతవకలు జరిగితే ఆందోళనలు తప్పవు

**– బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్**



వేములవాడ, జూలై 7: వేములవాడ పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస కళ్యాణ మండపంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ, రాజన్న ఆలయంలో ఇటీవల జరిగిన ఉద్యోగ నియామకాలపై వస్తున్న కథనాలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు.ఆలయ ఉద్యోగాలను నిబంధనల ప్రకారం భర్తీ చేయాల్సిన బాధ్యత ఆలయ ఈవోపై ఉందని, అయితే స్థానికేతరులకు ఉద్యోగాలు కల్పించడం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధితో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని, నియామకాలలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.రాజన్న ఆలయంలో దర్శనాలు నిలిపివేసిన సమయంలో శివరాత్రి నాటికి దర్శనాలు పునరుద్ధరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారని, ఇప్పుడు వచ్చే ఏడాది మాత్రమే ప్రారంభమవుతాయని చెప్పడం ప్రజలను నిరాశకు గురిచేసిందన్నారు. వేములవాడ అభివృద్ధి పేరుతో రాజన్నను స్థానిక ప్రజలకు దూరం చేశారని విమర్శించారు.శ్రావణ మాసం నుంచే స్థానిక భక్తులకు రాజన్న దర్శనం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు చేపట్టడంతో పాటు అవసరమైతే వేములవాడ బంద్‌కు కూడా పిలుపునిస్తామని హెచ్చరించారు.భీమన్న ఆలయంలో కూడా స్థానిక భక్తుల దర్శనానికి ఇబ్బందులు కలిగిస్తే సహించబోమని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని అక్రమంగా విధుల్లో ఉన్న వారిని గుర్తించి, వారికి ఉద్యోగాలు కల్పించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా నాయకుడు, కౌన్సిలర్ కుమ్మరి శంకర్, కౌన్సిలర్లు చిన్న ముత్యం, వంగల శీను, నాయకులు కోల కృష్ణస్వామి, రేగుల మల్లికార్జున్, పిన్నింటి హనుమంతులు, రేగుల శ్రీకాంత్, గుడిసె మనోజ్, చిక్కుడు మల్లేశం, అన్నం నరసయ్య, రఘుపతి, నేరెళ్ల సాయి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల క్షేమమే ప్రభుత్వ లక్ష్యం..

**-మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి పరిశీలించిన సర్పంచ్ కాటం వెంకటేశం**

నల్గొండ, జులై 7: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మధ్యాహ్న భోజన పథకంలో ప్రోటీన్లు అధికంగా ఉండే అల్పాహారం, నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని ప్రవేశపెట్టారని చిట్యాల సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు, పెద్దకాపర్తి సర్పంచ్ కాటం వెంకటేశం అన్నారు.

మంగళవారం చిట్యాల మండలం పెద్దకాపర్తి జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఆయన, విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు.ఈ సందర్భంగా కాటం వెంకటేశం మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం మెనూ రేట్లను పెంచడమే కాకుండా, ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో కలిసి భోజనం చేసేలా ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీంతో విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం అందడంతో పాటు వారు చదువులోనూ రాణించే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, ఉపాధ్యాయురాలు కందిమల్ల యశోద రెడ్డి, ఉప సర్పంచ్ ఓర్సు సైదులు, వార్డు సభ్యులు హరీష్ రెడ్డి, ప్రశాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ ఉంటే బొగ్గు బ్లాక్ లను ఇప్పించండి..

**-కేంద్రమంత్రికి టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి**

కరీంనగర్, జులై 7: సింగరేణి సంస్థ పట్ల ప్రేమ, కార్మికుల ఎడల గౌరవం ఉంటే వేలంపాటలో పాల్గొనకుండా కొత్త బొగ్గు బ్లాకులను కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి ఇప్పించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రి నిర్వహించిన సమావేశం వల్ల జరిగిన ప్రయోజనం శూన్యమన్నారు. అవినీతి ఊబిలో కూరుకుపోయిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కాపాడడానికేనని ఆయన ఆరోపించారు. సింగరేణిలో జరిగిన బొగ్గు కుంభకోణం పైన, డీజిల్, పేలుడు పదార్థాల కొనుగోలు, ఓవర్ బర్డన్ తొలగింపు టెండర్లలో అవినీతి, సోలార్ ప్లాంట్ ఏర్పాటులో జరిగిన అక్రమాలపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. బొగ్గు నిల్వల పైన సింగరేణి యాజమాన్యం విజిలెన్స్ విచారణ జరపాలని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు.

దొంగకే తాళం చేతులు ఇవ్వడం, సింగరేణి విచారణ జరపడం రెండు ఒకటేనన్నారు. కోల్ ఇండియాలో కార్మికులకు ఇస్తున్న విధంగా రూ.12,500 విలువైన బట్టలు సింగరేణిలో ఇప్పిస్తున్నారాఅని ప్రశ్నించారు. సింగరేణి సమీక్షా సమావేశం సందర్భంగా బీజేపీ, బీఎంఎస్ నాయకులతో వినతి పత్రాలు తీసుకొని చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. గోలేటి, మాదారం, కేకే ఓసీ మందమర్రి, జేకే-5 విస్తరణ ఇల్లందు, మణుగూరు ఓపెన్ కాస్ట్ గనుల అనుమతులను ఇప్పించి మీ నిజాయితీ నిరూపించుకోవాలని కేంద్ర మంత్రిని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావలసిన రూ.58 వేలకోట్ల బకాయిలను తక్షణమే ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

టెండర్లలో పాల్గొనే కాంట్రాక్టర్లు సైట్ విజిట్ సర్టిఫికెట్ ఉండాలని ఏర్పాటుచేసిన నిబంధన వలన సంస్థకు జరుగుతున్న నష్టం పై ఏర్పాటు చేసిన విచారణ కమిటీ నివేదిక ఏమైందని ఆయన ప్రశ్నించారు. బీజేపీ నేతలతో కలిసి నడుస్తున్న బీఎంఎస్, ఇతర కార్మిక సంఘాలను రాజకీయ జోక్యం అంటూ విమర్శించడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి, సీనియర్ ఉపాధ్యక్షుడు నూనె కొమురయ్య, అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ జాహిద్ పాషా, నాయకులు పోలాడి శ్రీనివాసరావు, ఐ సత్యం, ఏ గోపి, అక్బార్ పాషా, రోడ్డ సంపత్, పులిపాక శంకర్, వీ గౌడ్, రాజ్ కుమార్ చారి, గుమ్మడి సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# కళాకారుడు మారం ప్రవీణ్ (పప్పి) ని ఆదుకోవాలి

**– టీయూఎఫ్) కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి**

రాజన్న సిరిసిల్ల, జులై 7:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ఉద్యమ కళాకారుడు, సీనియర్ డాన్స్ మాస్టర్, ప్రముఖ యూట్యూబ్ కళాకారుడు మారం ప్రవీణ్ కుమార్ (పప్పి) తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లోని కార్తికేయ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రవీణ్ కుమార్‌ను యెల్ల పోశెట్టి, రాజన్న సిరిసిల్ల జిల్లా కళాకారుల విభాగం ఉపాధ్యక్షుడు కనపర్తి హనుమాన్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా యెల్ల పోశెట్టి మాట్లాడుతూ.. ప్రవీణ్ కుమార్‌కు నరాల శస్త్రచికిత్సతో పాటు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరమని, ఇందుకు సుమారు రూ.35 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారని చెప్పారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించని నేపథ్యంలో చికిత్సకు అవసరమైన నిధులు సమకూర్చడం కష్టంగా మారిందన్నారు.గతంలో కళారంగంలో సేవలందించడంతో పాటు ఆపదలో ఉన్న అనేక మందికి సహాయం చేసిన ప్రవీణ్ కుమార్‌కు ఇప్పుడు కళాకారులు, కళాభిమానులు, దాతలు తమ వంతు సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. విరాళాలు అందించదలచిన వారుగూగుల్ పే, ఫోన్ పే 8125358565 నంబర్‌కు పంపాలని కోరారు.

# లంపి వ్యాధిపై ఉచిత టీకాల శిబిరం

**-పాడి రైతులు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలి - మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**



రాజన్న సిరిసిల్ల, జులై 7:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపాలిటీ 15వ వార్డులోని హన్మక్కపల్లిలో ఆవు జాతి పశువులను లంపి స్కిన్ డిసీజ్ (ఎల్ఎస్‌డీ) నుంచి రక్షించేందుకు ఉచిత టీకాల కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లంపి వ్యాధి నివారణలో టీకాలు అత్యంత ప్రభావవంతమైనవని, పాడి రైతులందరూ తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, పశువుల ఆరోగ్య సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో వేములవాడ అర్బన్ పశు వైద్య అధికారి డాక్టర్ రామకృష్ణ సాడిగె, పశువైద్య సిబ్బంది శంకర్ గౌడ్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ రాంరెడ్డి, గోపాలమిత్రలు రాజు, శ్రీనివాస్, పాడి రైతులు బుర్ర ఎల్లయ్య, ఉమాపతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు. పలువురు రైతులు తమ పశువులకు ఉచితంగా టీకాలు వేయించుకొని సేవలను వినియోగించుకున్నారు.

# తెలంగాణ గర్వించదగ్గ మైలురాయి..

**-మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కు ప్రతిష్టాత్మక 'NABH' గుర్తింపు?..**
**-నాణ్యమైన వైద్య సేవలకు నిదర్శనంగా నిలిచిన ఘన్‌పూర్ మెడిసిటి?**
**-రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన అతికొద్ది టీచింగ్ హాస్పిటల్స్ లో ఒకటిగా గుర్తింపు**
**-విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన సంస్థ యాజమాన్యం**




మేడ్చల్, జులై 7: వైద్య సేవల రంగంలో నాణ్యతా ప్రమాణాలకు మారుపేరుగా నిలిచే ప్రతిష్టాత్మక ఔంఃఊ గుర్తింపును మేడ్చల్ జిల్లా ఘన్‌పూర్ లోని మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సొంతం చేసుకుంది. తెలంగాణలోని మెడికల్ కాలేజీ అనుబంధ హాస్పిటల్స్ లో ఈ అరుదైన గుర్తింపు సాధించిన అతి కొద్ది సంస్థలలో ఒకటిగా మెడిసిటి హాస్పిటల్ నిలిచింది. ఈ మేరకు ఈ రోజు ఉదయం కాలేజ్ ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల ప్రత్యేక సమావేశంలో సంస్థ యాజమాన్యం వివరాలను వెల్లడించింది.

ఈ సమావేశంలో మెడిసిటి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ NABH శ్రీ ఐనిష్ మర్చంట్ మాట్లాడుతూ.. వైద్య సేవల్లో నాణ్యత అనేది ఒక రోజుతో ముగిసేది కాదని, అది నిరంతరం కొనసాగే ప్రక్రియ అని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా సంస్థ అందిస్తున్న నాణ్యమైన సేవలకు, సిబ్బంది పట్టుదలకు ఈ ఔంఃఊ అక్రిడేషన్ నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. సంస్థ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె. శివరామకృష్ణ మాట్లాడుతూ.. 1980 నాటి నుండి మెడిసిటి ఎన్నో అరుదైన ఘనతలను సాధించిందని గుర్తుచేశారు.

1990ల ప్రాంతంలో అమెరికాలో పనిచేస్తున్న వైద్యులు లాభాపేక్ష లేకుండా ఈ సంస్థను స్థాపించారు. 1993లోనే హైదరాబాద్ నగరంలో గుండెకు బైపాస్ శస్త్రచికిత్సలు, స్టెంట్ వేసే అత్యాధునిక చికిత్సను అందుబాటులోకి తెచ్చిన ఘనత మెడిసిటిది అని ఆయన వివరించారు. ఔంఃఊ బృందం హాస్పిటల్ లోని అన్ని విభాగాలను, నాణ్యతా ప్రమాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే ఈ గుర్తింపు ఇచ్చిందని ఆయన తెలిపారు. ఈ అక్రిడేషన్ శాశ్వతం కాదని, ప్రతి రెండు-మూడేళ్లకు ఒకసారి తిరిగి తనిఖీలు ఉంటాయని కాబట్టి నాణ్యతను నిరంతరం కాపాడుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

ఈ ప్రక్రియ ద్వారా సిబ్బందిలో బాధ్యత పెరిగి, రోగులకు లోపాలు లేని వైద్యం అందుతుందని, భవిష్యత్తులో మరిన్ని అత్యాధునిక సదుపాయాలు తీసుకువస్తామని ప్రకటించారు. ఈ రోజు విలేకరుల సమావేశంలో మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె. శివరామకృష్ణ, మెడిసిటి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఈఓ శ్రీ ఐనిష్ మర్చంట్, మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవేంద్ర సింగ్ నేగి తదితరులు పాల్గొని విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.